ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## స్టేట్ విజన్

STATE VISION

మంగళవారం 1-09-2026 పేజీలు : 16



భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని నివాసంలో వారి చిత్రపటానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్.

# హుస్నాబాద్‌ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తాం

- విద్యా వైద్యం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నాం
- ఇంజనీరింగ్ కళాశాల బాలికల బాలుర భవనాలకు హాస్టళ్లకు శంకుస్థాపన

బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 31: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఉమ్మాపూర్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బాలుర ,బాలికల హాస్టల్స్ నూతన భవనాలకు,ఒక్కో హాస్టల్ కి 7.28 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 14.56 కోట్ల రూపాయల వ్యయంతో హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బాలుర ఒ బాలికల హాస్టల్ కి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హుస్నాబాద్ కి ఏదైనా యూనివర్సిటీ వస్తె బాగుండు అనే మాట వ్యక్తం చేశారని,అప్పుడు వెంటనే హుస్నాబాద్ కి ఇంజినీరింగ్ కాలేజీ కావాలని ప్రతిపాదనలు చేశామన్నారు. పెద్దపల్లి కీ ముఖ్యమంత్రి వచ్చినప్పుడు కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి ఎల్ఎల్బి , ఎల్ఎల్ఎం, ఫార్మసీ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ అడగగానే మంజూరు చేస్తున్నామని ప్రకటించారన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసుకున్నామని,ఇప్పుడు హాస్టల్ భవనాలకు శంకుస్థాపన 6 పేజీలో...

## పేదల సంక్షేమం ,గ్రామాల అభివృద్ధే ప్రజాపాలన ప్రభుత్వ ధ్యేయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఎమ్మెల్యే

నల్లబెల్లి,ఆగస్ట్ 31(విజన్ ఆంధ్ర):పేదల సంక్షేమం,గ్రామాల అభివృద్ధే ప్రజాపాలన ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. 7 పేజీలో...

## ఉజ్వల కనెక్షన్ ఇచ్చారు.. సిలిండర్ మరిచారు...

- ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగిన పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీ
- చౌటకూరులో ఇళ్ల స్థలాల లబ్దిదారుల జాబితాను వెల్లడించండి

చౌటకూర్ ఆగస్టు 31 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద మంజూరైన పొయ్యి, రెగ్యులేటర్, ధృవపత్రాలు అందజేశారని.. సిలిం డర్ మాత్రం ఇవ్వలేదని లబ్దిదారులు ఆరోపించారు. చౌటకూర్ మండల ప్రజా పరిషతు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో లబ్దిదారులలు వినతి పత్రం అందజేశారు. 14 పేజీలో...

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

నిజామాబాద్ ఆగస్టు31:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 2 పేజీలో...

# బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ కావాలి

- ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా
- నాలుగేళ్లు ఈడీ, సీబీఐ ఇబ్బంది పెట్టినా ధైర్యం సడలలేదు.. దారి తప్పలేదు
- అమ్మ ఇంటివాళ్లు నిర్ధాక్షణ్యంగా తరిమేస్తే అత్తింటి వాళ్లు కన్న బిడ్డలా అక్కున చేర్చుకున్నారు
- తండ్రి, కూతురును పాపిన ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను.. నా ఉసురు తగులుతుంది
- ఓ వైపు కాంగ్రెస్ పై పోరాటం చేస్తూనే టీఆర్ఎస్ నిర్మాణం చేస్తాం
- వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ ఆగస్టు31: (విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా నుండి మొదలుపెట్టిన తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సాధించుకుంటే జీవితాలు మారిపోతాయని భావించి ప్రజలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముందని ఆమె అన్నారు. సోమవారం నిజామామాబాద్ లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాలుగిండ్లు మాత్రమే బంగారు మాయమయ్యాయని అన్నారు. సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాల్సిన అవసరముందని అందుకోసం సామాజిక న్యాయ తెలంగాణ అవసరమని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం 20 ఏళ్లు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ నుంచి నిర్ధాక్షణ్యంగా వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవుల కోసం పార్టీ పెట్టలేదని తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం పంతం పట్టి పార్టీ పెట్టానని అన్నారు. 10 పేజీలో...



# ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

నిజామాబాద్ ఆగస్టు31:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత తీర్చిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ పట్టణం తోపాటు కొన్ని గ్రామాలలో గత కొన్ని నెలలుగా యూరియా యాప్ డౌన్లోడ్ కాకపోవడం డౌన్లోడ్ అయితే యూరియా బుక్ కాకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బంది పడ్డారు ఇట్టి విషయాన్ని ప్రజావాణిలో మరియు సబ్ కలెక్టర్ ఎమ్మార్వో వ్యవసాయ అధికారులకు విన్నవించడం జరిగింది. మరియు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గారి దృష్టికి ఆర్మూర్ ఆరు పంటల రైతు సంఘం ప్రతినిధితో ఈ యాప్ గురించి తీసుకెళ్లగా వారు విని వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు గౌరవనీయులు శ్రీ తుమ్మల నాగేశ్వరావు గారితో మాట్లాడి యాప్ డౌన్లోడ్ అయ్యే విధంగా యూరియా బుక్ ఏ విధంగా చేయాలో చూడడం జరిగింది పట్టణ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ గౌరవ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి ఆర్మూర్ ఎమ్మెల్యే గౌరవ పైడిరాకేష్ రెడ్డికి జిల్లా కలెక్టర్కు సంబంధిత వ్యవసాయ అధికారులకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపిన ఆర్మూర్ పట్టణ రైతు సంఘం ప్రతినిధులు రైతులు మాట్లాడుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి రైతు పక్షపాతి అని అర్బన్ రైతు ప్రతినిధులు తన దృష్టికి యూరియా పరిష్కారం చేయాలని చెప్పగానే పరిష్కారం చూపడం చాలా అభినందనీయమని ఈ సమ యంలో మొక్కజొన్నకు వరికి యూరియా చాలా అవసరమని యూరి యా వాడకుంటే దిగుబడి చాలా తగ్గేదని సరైన సమయంలో రైతులకు యూరియా పరిష్కారం చేయడం జరిగిందని అన్నారు గతంలో కూడా రైతులకు వడ్ల కొనుగోలు విషయంలో సంబంధిత అధికారులకు మాట్లాడి వెంటనే కొనుగోలు అయ్యే విధంగా చూశారని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కి రైతు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలికోట గంగాధర్ మగ్గిడి రాజేశ్వర్ బొల్లు పోతన్న నారడి మల్లయ్య డబ్బా లింగం భూపతి రెడ్డి దోమకొండ రవీందర్ నక్కల బాజన్న, రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన గర్భిణీ



జన్నారం, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : అంబులెన్స్ లోనే గర్భిణీ స్త్రీ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. జన్నారం మండలంలోని కవ్వాల్ హాస్టల్ తండాకు చెందిన కొమురె అనసూయకు సోమవారం రోజున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దండేపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన హాస్టల్ తండా గ్రామానికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటి నొ ప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటి మునిందర్ గౌ డ్ చాకచక్యంగా వ్యవహరించి అంబులెన్స్ లోనే కాన్పు నిర్వహించడంతో ఆమె పండంటి ఆడబిడ్డ కు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని ఈఎంటి మునిందర్ గౌ డ్, పైలట్ మహేందర్ తెలిపారు. అంబులెన్స్ సి బ్బంది సకాలంలో స్పందించి తల్లీబిడ్డల ప్రాణాల ను కాపాడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# 'ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి' -ఏసీపీ కిరణ్ కుమార్



మందమర్రి,రామకృష్ణాపూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై పోలీసులు పరిశీలిస్తూ తక్షణమే స్పందించాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఏసీపీ స్టేషన్ పరిసరాలను,రికార్డులను,నమోదు అయిన కేసుల వివరాలను,సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్శ రమేష్,ఆర్కేపీ ఎస్సై జాడి శ్రీధర్,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయండి

నిజామాబాద్ ఆగస్టు31:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగరంలో సోమవారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల ప్రోగ్రాం అధికారులు మరియు డిప్యూటీ డిఎంహెచ్వో లకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. డి ఎం హెచ్ ఓ ఛాంబర్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి హాజరైనట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పాఠశాలలో కళాశాలలో ఆరోగ్యం పైన అవగాహన కలిగించాలని, జీవనశైలి వ్యాధులపై, క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ ఊబకాయానికి గురికాకుండా చూడాలని కాలేజీలలో మిస్టర్ అండ్ మిస్ట్రెస్ లను ప్రోత్సాహిస్తూ మారతాను రన్నింగ్ కాంపిటీషన్లను నిర్వహించాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతుల ను ప్రోత్సాహంగా అందించాలన్నారు. టీబీ ఎంబీఏ లో భాగంగా ప్రతి కుటుంబాన్ని, డ్వాక్రా మహిళలను, బీడీ వర్కర్లను ప్రభుత్వ ఆధీనంలోని వి ఏ ఓ లు ,విలేజ్ సెక్రటరీలను, మెప్మా మెంబర్లను ఉపయోగించి కౌన్సెలింగ్ మరియు అవగాహన కలిగించాలన్నారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా మెడికల్ కాలేజ్ విద్యార్థులతో ప్రతి



మండలంలో హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహన కలిగించాలని అన్నారు. ఆశ కార్యకర్తల్లో ఆరోగ్యంపై అవగాహన విస్తృతంగా కలిగించి వారి సేవలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తి వ్యాధి నిరోధక టీకలను 100% ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైతే వ్యాధి నిరోధక టీకాలకు వ్యతిరేకత ఉన్నదో అక్కడ వారికి విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందు బాటులో ఉన్న ఔషధాలపై విస్తృతంగా అవగాహన కలిగించాలని, వైద్య ధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. వైద్యాధికారులకు నెలకోసారి ఫిజికల్ సమావేశం నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసినప్పుడే తేరిసియరి ఆరోగ్య0 పై భారం పడదన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ కొత్త దనాన్ని, సృజనాత్మకత దృష్టితో సాధారణ సేవలకు భిన్నంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మాతాశిషూ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా జరిగితే ఎందుకు జరిగినాయి అని కారణాలను వెతికి అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఅన్ని జాతియా ఆరోగ్య కార్యక్రమాలపై డిఎంహెచ్ఓ రాజశ్రీ మేడం వివరించడమే కాకుండా ప్రోగ్రాం అధికారులు వారి వారి కార్యక్రమాలపై వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ బేబీ నాగేశ్వరి, డి ఐ ఓ డాక్టర్ అశోక్, ఏఓ సుమంత్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విద్య, సికందర్ నాయక్, డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న డాక్టర్ అంజన, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భార్గవి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ కీర్తన, ఎస్ఓ రాజేశ్వర్ , ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ,డిపిఓ విశాల, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి



- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.
- భాదితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే
- హర్షం వ్యక్తం చేస్తున్న సీఎం సహాయ నిధి భాదితులు.
- ఎమ్మెల్యే కు,సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

నందిగామ:ఆగస్టు 31(విజన్ ఆంధ్ర న్యూస్); ప్రజల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో
మండల కేంద్రమైన నందిగామ గ్రామానికి చెందిన వడ్ల వెంకట చారి కి రెండు లక్షల రూపాయలు, బందారు గీతాంజలికి రూ. 18,500 రూపాయల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీఠ వేసిందన్నారు.నిరుపేదలకు, అట్టడుగు వర్గాల ప్రజలకు అత్యవసర సమయాల్లో తక్షణ ఆర్థిక సాయంగా సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకోవడం గర్వకారణం అన్నారు.సీఎం సహాయనిధి చెక్కులను పొందిన లబ్దిదారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,సర్పంచ్ కొమ్ము కృష్ణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లి కుమార స్వామి గౌడ్,మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్,వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్ గౌడ్, శివగల్ల ప్రవీణ్,శివగల్ల సురేష్ బొమ్మగళ్ళ నర్సింలు,కిట్టు,ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు,అస్వర్ పాష,నాయకులు చించేటి శివకుమార్ గౌడ్,చించేటి కృష్ణ,కేశమోని రామచంద్రి,నరేందర్ రెడ్డి,చేన్నగళ్ళ జంగయ్య, తడకల జంగయ్య, అభిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి బిక్షపతి

నర్సాపూర్ : హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామానికి చెందిన అల్లంకి ప్రభాకర్ కుమారుడి వివాహము మంగాపూర్ శివారులో గల ఎస్ ఎస్ ఆర్ గార్డెన్ లో జరిగిన ఈ వివాహానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి పాల్గొని వారిని ఆశీర్వదించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళు ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో చల్లగా ఉండాలని ఆయన తెలిపారు ఆయన వెంట గ్రామ పంచాయతీ సభ్యులు రాజశేఖర్ మాజీ వార్డ్ మెంబర్ శంకర్ కిషన్ రాజు శేఖర్ సాయిబాబా అనిల్ మోహన్ విజయ్ కుమార్ నరేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు




# మున్సిపల్ ఆదేశాలు బేఖాతర్ !

- రోడ్లకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా పండ్ల దుకాణాలు..
- పట్టించుకోని అధికారులు..
- రాజకీయ అండ ఉందంటూ వ్యాపారుల ధీమా



పరకాల విజన్ ఆంధ్ర : పరకాల పట్టణంలో రోడ్లకు ఇరువైపులా పండ్ల దుకాణాలు ఏర్పాటు చేయొద్దని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తోపుడు బండ్లను రోడ్లపై ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులు సూచించినా కొందరు వ్యాపారులు తమకు నచ్చిన చోటే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**రాజకీయ అండ ఉందంటూ..**

తమకు రాజకీయ నాయకుల అండ ఉందని, ఎవరూ ఏమీ చేయలేరంటూ కొందరు వ్యాపారులు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రమాదాలకు దారితీసేలా..**

రోడ్లను ఆక్రమించి తోపుడు బండ్లు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు, మున్సిపల్ సిబ్బంది స్పందించి రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# జోర్దారగా కొనసాగిన ఉచిత మేఘ ఆరోగ్య శిభిరం



బాల్కొండ (నిజామాబాదు జిల్లా) విజన్ ఆంధ్ర (ఆర్. సి)డిసెంబర్ 31:- నిజామాబాదు జిల్లా జక్రాన్ పల్లి మండలంలోని గన్య నాయక్ తండాలో ఉచిత మేఘ ఆరోగ్య శిభిరం ఆదివారం జోర్ధారగా కొనసాగింది. డాక్టర్ అజ్మీర ప్రకాష్ ఆధ్వర్యంలో తల్లి తల్లి దూరి బాయి, తండ్రి బిక్యా నాయక్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన శిబిరంలో లక్ష్మీ శైలజ "బెడ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ "మల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్,మరియు నిజామాబాదు ప్రముఖ వైద్యులైన స్త్రీ రోగ నిపుణురాలు, డాక్టర్ శైలజ కళ్యాణి,చంద్రమోహాన్,హృదయ నిపుణులు కూరుపాటి కార్తీక్,కళ్యాణ్,ఊపిరి తిత్తుల నిపుణులు రాజేశ్వర్ వైష్ణవి అతిర , ప్రభుత్వ మెడికల్ కాలేజీ సహాయక ప్రొఫెసర్ సుజాత తదితరులు పాల్గొనగ రోగులకు ఉచితంగా మందులు అంధజేశారు. డా,అజ్మీర ప్రకాష్ పుట్టిన ఊరికి ఉపకారంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ప్రముఖ డాక్టర్ల బృందంతో ఇలాంటి మెడికల్ క్యాంపు నిర్వ హిస్తూ పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినంద నీయమని డాక్టర్ ప్రకాష్ గురువైన బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు అభినందించారు. పైగా గ్రామానికి
రూ,2,30,000/- "వైకుంఠ రతాన్ని"చేయించి ఇచ్చారని ఊర్లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సంవ త్సరశీ ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్నారని, ఒకే కుటుంబంలో అందరూ డాక్టర్లే నని గ్రామానికి చెందిన చెందర్ నాయక్ వివరించారు. డా,ప్రకాష్ హైదరాబాద్ లో సూరారం లో మల్లారెడ్డి నారాయణ ఆసు పత్రి లో హృదయ రోగుల సీనియర్ కన్సల్టెంట్ 2010 లో చేరి ఈ రోజు వరకు 12,000 కంటే ఎక్కువ ఓపెన్ హార్ట్, సర్జరీల తో పాటు గుండె (హార్ట్)లో స్టంట్స్ వేయడంతో ఎందరోమందికి ప్రాణాలు కాపాడిన "వైద్య.నారాయణో హరి" అంటూ గన్య నాయక్ తాండ లో పుట్టిన "దేవుడని" చెప్పుకుంటారు.

**పేదల పెన్నిధి డా, అజ్మీరా**

నేటి సమాజానికి ఉపయోగ పడే విధంగా ఒకే కుటుంబంలో ఐదుగురు డాక్టర్లు కావడం ఈప్రాంతానికే గర్వ కారణమని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నేషనల్ యూత్ ప్రాజెక్ట్ యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనై జేషన్ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు అధ్యక్షులు మోతె రామ గౌడ్, సెక్రెటరీ జనరల్ బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు హర్షం వ్యక్తం చేశారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

నిజామాబాద్, ఆగస్టు 31 :(విజన్ ఆంధ్ర )రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ - మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ అర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న పరకాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు – అమరవీరులకు ఘన నివాళులు

హనుమకొండ జిల్లా పరకాల విజన్ ఆంధ్ర : భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ గారి ఆధ్వర్యంలో సోమవారం పరకాలలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్‌లి గారు ముఖ్య అతిథిగా పాల్గొని, సెప్టెంబర్ 2న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లు, కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

సెప్టెంబర్ 2న అమరవీరులకు నివాళులు అర్పించేందుకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుగారు పరకాలకు విచ్చేయనున్నారు.

ఈ సందర్భంగా అమరధామంలో అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నారు.

దేశం, ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగాలు చేసిన అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంలి చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు:

హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజ్ పురోహిత్ జయంతి లాల్, దేవునూరి మేఘనాథ్, పరకాల మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయకుమార్, జిల్లా కోశాధికారి రామన్న, రాజా వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, గాదీజ మోర్చా పట్టణ అధ్యక్షులు పైండ్ల రంజిత్, పట్టణ కార్యదర్శి దంచనాదుల కిరణ్, నాయకులు దంచనాదుల సత్యనారాయణ, కానుగుల గోపీనాథ్, మెంతుల సురేష్, పిట్ట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## శివనామస్మరణతో వాసర్ నుంచి సిద్దేశ్వరుడి సన్నిధికి పాదయాత్ర

సిర్గాపూర్ విజన్ ఆంధ్ర ఆగస్ట్ 31 : శ్రావణ మాసం సందర్భంగా వాసర్ గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కంగ్టి సిద్దేశ్వర ఆలయానికి పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలోని సోమవారం రోజున గ్రామస్తులు ఈ పాదయాత్రను సంప్రదాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా భక్తులు భజనలు చేస్తూ, శివనామస్మరణతో పాదయాత్రగా సిద్దేశ్వర ఆలయానికి బయలుదేరారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, యువకులు పాల్గొని భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. శివనామస్మరణతో సాగిన పాదయాత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## రాజకీయ లబ్ధి కోసమే ఎమ్మెల్యే సునీత రెడ్డి పాదయాత్ర

**- నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి**



విజన్ ఆంధ్ర హత్నూర : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి రాజకీయ లబ్ధి కోసం పాదయాత్ర చేయడం ప్రజలు గమనిస్తున్నారని గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి చేసింది ఏమీ లేదని ఆయన అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రస్తుత ఎమ్మెల్యే సునీత రెడ్డి రహదారి పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఆయన అన్నారు గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి చేసింది ఏమి లేదన్నారు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం వెంటఉన్నారని ఆయన అన్నారు వెల్దుర్తి మండల ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇప్పుడు రహదారి విస్తీర్ణ పేరుతో పాదయాత్ర చేపట్టడం కేవలం రాజకీయ లబ్ధి కోసమే నని ఆయన విమర్శించారు ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకోసమే పని చేస్తుందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒకటొకటిగా అమలు చేస్తుందని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి అన్నారు

## ప్రజావాణిలో ముచ్చటగా నాలుగు దరఖాస్తులు

అందోల్ ఆగష్టు 31 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ముచ్చటగా నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తమ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామానికి చెందిన కార్యదర్శులు ఐకేపీ ఏపిఎం రుక్మిణి డాక్టర్ సారిక ఏఎన్ఎం హసీనా బేగం ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి

**- తమ భూమిని ఇతరుల పేర్లపై పట్టా చేశారని ఆరోపణ**

**- ప్రజావాణి లో అధికారులకు బాధితుల ఫిర్యాదు**

(విజన్ ఆంధ్ర) ఆగస్ట్ 31: జేడి మల్లంపల్లి మండలం రామచంద్రాపురం శివారులోని సర్వే నంబర్ 3293లో తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు తెలియకుండా ఇతరుల పేర్లపై అక్రమంగా పట్టా చేశారని ఆరోపిస్తూ భూమ స్వామి కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా జరిగిన పట్టా మార్పిడులను రద్దు చేసి తమ భూమిని తమ పేర్లపై పట్టా చేయాలని కోరారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన భూమ స్వామి తండ్రి భూమ లక్ష్మయ్య పేరున సర్వే నంబర్ 3293, ఖాతా నంబర్ 1517లో 2 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ భూమిని తమ కుటుంబం సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం, అనుమతి లేకుండా భూమిలోని 1 ఎకరం 32 గుంటలను ఇతరుల పేర్లపై పట్టా మార్పిడి చేసినట్లు ఆరోపించారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన మార్త సదానందం, తండ్రి రాజయ్య తమ భూమిలోని 0.36 గుంటలను క్యాతం ప్రవళిక, భర్త రమేష్ పేర్లపై పట్టా చేయించినట్లు, మరో 0.36 గుంటలను ఓ మైనింగ్ పేరున పట్టా చేయించినట్లు ఫిర్యాదులో తెలిపారు. సదరు భూమిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు సమస్య పరిష్కారానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడమే కాకుండా తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూమి రికార్డులను పరిశీలించి, అక్రమ పట్టాలను రద్దు చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో భూమ స్వామి, స్వరూప, జనార్దన్, చంద్రమౌళి, కవిత, ప్రవీణ్, పూల, సతీష్, మేఘ అర్జున్, సందీప్ ఉన్నారు.

## డ్రగ్స్ ట్రాఫిక్ నియమాలు సైబర్ నేరాలపై ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ కృష్ణవేణి హైస్కూల్లో అవగాహన సదస్సు..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 31 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్లో మన కాలనీ మన భద్రత మన బాధ్యత విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ట్రాఫిక్ నియమాలు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన మన కాలనీ మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్మూర్ పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ ట్రాఫిక్ నియమాలు మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు దేశ భవిష్యత్తు మత్తు పదార్థాల డ్రగ్స్ బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్ట వ్యతిరేకమని విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉండాలని తెలియని లింకులను క్లిక్ చేయవద్దని సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ హామీ

**- ప్రజల నుంచి వినతుల స్వీకరణ.. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు**

**- రాఖీలు కట్టిన రోడామేస్త్రీనగర్ మహిళలు.. శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలుసుకుని వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన సమస్యల్లో కొన్నింటిపై ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మరికొన్ని సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాఖీ కట్టిన మహిళలు రోడామేస్త్రీనగర్ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు రాఖీ పౌర్ణమి సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. తనపై మహిళలు, ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు కార్యక్రమం

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 31: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేకంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.

మహిళా పారిశుధ్య సిబ్బంది ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, సిబ్బందిలో ఐక్యత మరియు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రీడా పోటీలలో విజయం సాధించిన మహిళా పారిశుధ్య సిబ్బందికి హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి చేతుల మీదుగా షీల్డులు అందజేసి అభినందించారు. పారిశుధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న మహిళా పారిశుధ్య సిబ్బందిని ప్రోత్సహించేందుకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చైర్పర్సన్ దండి లక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మరవీందర్, కౌన్సిలర్స్ చెన్నవేణి అనూష,సావుల మంజుల,పూదరి వరప్రసాద్,కేశవేణి రమేష్, గాదెపాక రవీందర్,బత్తుల స్వరూప,గోపగోని శోభన్ బాబు,కో ఆప్షన్ సభ్యులు ఎండి హసన్,మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మా తాతలు నుండి వచ్చిన భూమి మాకు కావాలి



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ) కుందనపల్లి గ్రామ శివారు చలివాగు పక్కన సర్వే నెం. 377/డి లో దేశెట్టి లక్ష్మయ్య 24 గుంటల సర్వే నెం. 377/డి లో దేశెట్టి కుమారస్వామి గారికి 25 గుంటలు, మొత్తము 1,0900 ఒక ఎకర తోమ్మిది గుంటలు వ్యవసాయ భూమి ఉన్నది అయితే గత కొన్ని సంవత్సరాల క్రితము చలివాగు అధిక మొత్తములో ఉప్పొంగడంతో బారి ఎత్తున ఇసుక మేటలు పెట్టినాయి. అప్పటి నుండి వ్యవసాయం చేయుటకు అనుకూలంగా లేదు.

ప్రస్తుతము మేము అట్టి భూమిని దుబ్బును తీసి వేసి వ్యవసాయ పనులు చేస్తుంటే, కుందనపల్లి గ్రామ ఉపసర్పంచు అరకొండ క్రాంతి మరియు వార్డు మెంబర్ భర్త అరకొండ రాజేశం అది మా భూమి ఇందులో ఏవరు రావద్దు అని మా మీద దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచూస్తూ బెదిరిస్తున్నారు. వీరికి 377/ సర్వే నెంబర్లో ఏలాంటి భూమి లేదు. ఇట్టి సర్వే నెం.లో ఇతర కులాలకు సంభందించిన ఆరు మంది ఉన్నారు. వీరికి పూర్వము చెరువు నీరడి మరియు సుంకరి (మస్కరి) కమ్మరి, కుమ్మరిలకు ఇనామిగా ఇచ్చి అధికారికంగా పట్టా పుస్తకాలు ఇవ్వడం జరిగింది.

ఇట్టి భూమిపై మాకు ఎలాంటి హక్కు లేదని మా పై దాడులు చేస్తూ బయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చట్టరిత్యా కట్టిన చర్యలు తీసుకొని మాకు సరియైన న్యాయం చేయాలంటూ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం గేటు ముందు కుటుంబ సభ్యుల తో బైటాయించారు. పోలీస్ లు అక్కడికి చేరుకొని కలెక్టర్ కార్యాలయం లో ప్రజావాణి లో దరఖాస్తు చేసుకువాలని చెప్పడం తో అక్కడికి వెళ్లి సమస్యలు అధికారులకు విన్నవించారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**- ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**- వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**

**- ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలి.. నియోజకవర్గాల వారీగా నిరసనలు : రాగిడి లక్ష్మారెడ్డి**

**- సెప్టెంబరు 1 నుంచి 10 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలకు బీఆర్ఎస్ కార్యాచరణ**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై నియోజకవర్గస్థాయి ఉద్యమ కార్యాచరణకు పార్టీ శ్రీకారం చుట్టింది. దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మలో ఉన్న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు తీరు, పెండింగ్ అభివృద్ధి పనులు, ప్రజా




సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

హామీలు అమలు కాలేదని ఆరోపణ

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలతో పాటు రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంతో పాటు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలు పరిస్థితిని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబరు 1 నుంచి ఉద్యమ కార్యాచరణ

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు సంబంధించి బీఆర్ఎస్ ప్రకటించిన కార్యాచరణను నియోజకవర్గంలో విస్తృతంగా చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సెప్టెంబరు 1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై 'ఛార్జ్‌షీట్' విడుదల చేయనున్నారు. సెప్టెంబరు 2న నియోజకవర్గ కేంద్రాల్లో ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ ధర్నాలు నిర్వహించి, ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు 3న రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ తదితర అంశాలపై రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 4న మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీల అమలుపై మహిళలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబరు 5న నిరుద్యోగులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై ధర్నాలు, ఆందోళనలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 7 నుంచి 10 వరకు ప్రజావాణి కేంద్రాల్లో వినతిపత్రాలు సమర్పించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమస్యలకు మద్దతుగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చర్చకు తీసుకురావడంతో పాటు నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రైనేట్ క్వారీతో మా గ్రామాలను ఆగం చేయొద్దు

**- మా పంట పొలాలను నాశనం చేయవద్దని రైతుల ఆవేదన**

**- క్వారీకి అనుమతిస్తే ప్రజలను సమీకరించి ఉద్యమం - చేపడతాం**

**- అక్కన్నపేట సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్**

హుస్నాబాద్/అక్కన్నపేట ఆగస్టు 31 : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని రేగొండ రెవిన్యూ గ్రామ పరిధిలో ప్రతిపాదించిన గ్రానైట్ క్వారీకి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని, మా గ్రామాలు మా పొలాలు,మా బ్రతుకులను ఆగం చేయొద్దని ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులతో రేగొండ గోవర్ధనగిరి గ్రామ ప్రజలు, రైతులు ముక్తకంఠంతో అధికారులను వేడుకున్నారు.గ్రెనేట్ కు అనుమతులు ఇవ్వద్దని సీపీఐ అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా క్వారీ ఏర్పాటు వల్ల రైతుల పంట పొలాలు దెబ్బతినడంతో పాటు గ్రామీణ ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్వారీ కోసం సర్వే నంబర్ 897లో 5.10 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.దీనికి సంబంధించి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా మొత్తం 22 మంది తమ అభిప్రాయాలను వెల్లడించగా, అందులో 19 మంది గ్రానైట్ క్వారీకి వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలిపారు. ప్రజల నుంచి ఇంత స్పష్టమైన వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో అధికారులు ప్రజాభిప్రాయాన్ని గౌరవించి క్వారీకి అనుమతులు ఇవ్వకూడదని భాస్కర్ కోరారు.ప్రతిపాదిత క్వారీ ద్వారా 13,011.84 క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను ఉత్పత్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని, అయితే దీనివల్ల పంట పొలాలు, వ్యవసాయ భూములు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులకు క్వారీ వల్ల మరింత ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్ లు మాట్లాడుతూ క్వారీలో పేలుళ్లు నిర్వహించడం, భారీ వాహనాల రాకపోకలు, దుమ్ము--ధూళి కారణంగా పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని అన్నారు. ముఖ్యంగా బ్లాస్టింగ్‌ల కారణంగా పంటలు దెబ్బతినడమే కాకుండా ఇళ్లకు, ప్రజలకు కూడా ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీకి సమీపంలో వ్యవసాయ భూములు, గ్రామాలు ఉన్నందున




ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు.రైతుల పంట పొలాలను నాశనం చేసి, ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే క్వారీ మాకు అవసరం లేదన్నారు.ప్రజాభిప్రాయ సేకరణలోనే 19 మంది క్వారీకి వ్యతిరేకంగా స్పష్టంగా అభిప్రాయం తెలిపారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి అధికారులు క్వారీ అనుమతుల ప్రక్రియను నిలిపివేయాలి. రైతుల భూములను, పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు.ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా క్వారీకి అనుమతులు మంజూరు చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో రైతులు, గ్రామ ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని సీపీఐ గా హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## రైతు వేదికలో "పగటి వెలుగులు"..

**పర్యవేక్షణపై ప్రశ్నలు..**

**ప్రభుత్వ సొమ్ముతో విద్యుత్ వృథా.. అధికారుల నిర్లక్ష్యం**

**రైతులకు రూల్స్ చెప్పే అధికారులే... రూల్స్ మరిచారా..!?**

కుకునూరుపల్లి, ఆగష్టు 31,విజన్ ఆంధ్ర : మండల పరిధిలోని మెదినివూర్ రైతు వేదికలో విద్యుత్ తీవ్రస్థాయిలో దుర్వినియోగమవుతోంది. పట్టపగలు సమయంలో కూడా భవనంలో విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. లైట్లను ఆర్పి వేయడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు విద్యుత్‌ను పొదుపు చేయాలని అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ వనంలోనే ఈ రీతిగా ప్రజాధనం వృధా కావడంపై ప్రజలు మండిపడుతున్నారు.ఒకవైపు రైతు వేదికకు బయట నుండి తాళం వేసి, లోపల మాత్రం అన్నీ విద్యుత్ దీపాలతో "జిగేలు "అనిపిస్తున్నారు అధికారులు. ఏదైనా పని మీద వచ్చే రైతులకు వంద రకాల నిబంధనలు చెప్పే అధికారులకు.. విద్యుత్ పొదుపు చేయాలన్న నిబంధన తెలియదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు..ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# హుస్నాబాద్ ని ఎడ్యుకేషనల్ హబ్ గా మారుస్తాం

చేసుకున్నామన్నారు.కాలేజీ హాస్టల్ లోనే లైబ్రరీ పెట్టిస్తామని,విద్యార్థులు బాగా చదువుకోవాలి మీకు ఏ సమస్య ఉన్నా స్థానిక ఎమ్మెల్యే గా కాకుండా మీకు గార్డియన్ గా ఉంటామన్నారు.త్వరలో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కు రెండు బస్సులు రాబోతున్నాయన్నారు.ఎవరైనా దాన గుణం ఉన్నవారు విద్యార్థులకు ల్యాప్ టాప్ లు ఇస్తామన్నారు.నియోజకవర్గంకి ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తామన్నారు.హుస్నాబాద్ ప్రాంతానికి సంబంధించిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని,రేపటి భవిష్యత్ లో మంచి ప్లేస్ మెంట్ వస్తాయి..ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.విద్యార్థి నాయకుడిని కాబట్టి ఇక్కడికి ఇంజనీరింగ్ కాలేజీ వచ్చిందన్నారు. విద్యా వైద్యం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఉమేష్ కుమార్,రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ బంక చందు కాంగ్రెస్ పార్టీ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు వద్దేపల్లి వెంకటరమణ,వెన్నరాజు జిల్లా గ్రంధాలయం మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, అధికారులు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు,కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

**- సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వినూత్న నిరసనలు**

**- బాకీ కార్డులతో కాంగ్రెస్ హామీల వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతాం**

**- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 31: రాష్ట్రములో కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని,కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోగించనుందని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతి మండలం, మున్సిపాలిటీ, గ్రామం, వార్డుల్లో వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమాల నిర్వహణపై హుస్నాబాద్ మున్సిపాలిటీతో పాటు



నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వొడితల సతీష్‌కుమార్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అన్నారు,వెయ్యి రోజులు దాటినా అమలు ఏదని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు.రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఎక్కడ? విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఎక్కడ? వృద్ధులు, పేదలు, కార్మికులు, కౌలు రైతులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని గుర్తు చేస్తూ "హామీ ఏమిటి? అమలు ఎంత? బాకీ ఎంత అనే లెక్కను ప్రజల ముందుంచుతామని తెలిపారు.బాకీ కార్డులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల తరఫున జవాబుదారీ పత్రాలు అన్నారు.హామీ ఇచ్చింది కాంగ్రెస్.. ఓట్లు అడిగింది కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్.. కాబట్టి హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన స్పష్టం చేశారు.స్థానిక సమస్యలపై ప్రజలతో కలిసి ఆందోళనలు,ప్రతి హామీకి లెక్క చెప్పాల్సిందేనన్నారు.సమీక్ష సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, వైస్ జెడ్పి చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎండి అన్వర్, ఏం సి మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి,మున్సిపాలిటీ పాటు వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం ,గ్రామాల అభివృద్ధే ప్రజాపాలన ప్రభుత్వ ధ్యేయం :

**- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఎమ్మెల్యే**



నల్లబెల్లి,ఆగస్ట్ 31(విజన్ ఆంధ్ర): పేదల సంక్షేమం,గ్రామాల అభివృద్ధే ప్రజాపాలన ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన మాసంపెల్లి వనజ -- అఖిల్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ......, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, సొసైటీ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, చిట్యాల తిరుపతి , చార్ల శివారెడ్డి,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## తొట్టెల ఊరేగింపు లో పాల్గొన్న ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్

బీబీనగర్ :31/ఆగస్ట్ (విజన్ ఆంధ్ర) పట్టణ కేంద్రంలోని శ్రీ బంగారు మైసమ్మ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి తొట్టెల ఊరేగింపు లో పాల్గొన్న ఆర్యవైశ్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్ ఈ వేడుకలో బీబీనగర్ మాజీ ఎంపిటిసి టంటం భార్గవ్ ,బీబీనగర్ దీ=ా పార్టీ యువజన నాయకులు టంటం గణేష్ , నాదీవీ యూత్ సభ్యులు మరియు బీబీనగర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారులి

# స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్నా..

**స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్నా..**

**తాహసిల్దార్ సూపర్డెంట్ కు వినతి పత్రం అందజేసిన**

**సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాల వీరయ్య..**

మరిపెడ,విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు,ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అలువాల వీరయ్య పాల్గొని మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని అంతర్గత రహదారులు సైడ్ డ్రైనేజ్ వ్యవస్థను మెరుపరచాలని ప్రభుత్వ పాఠశాలలో బిల్డింగ్స్, పహారి గోడలు, మంచినీరు, టాయిలెట్స్, కాళీ పోస్టులను భర్తీ చేయాలని మరిపెడ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, భవనం మార్కెట్ యార్డు, పాలసీతలీకరణ కేంద్రం, క్రీడ మైదానం అన్యాకాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని వీరయ్య డిమాండ్ చేశారు, అనంతరం వివిధ డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తాహసిల్దార్ సూపరడెంట్ కు అందజేశారు,



ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ మండల నాయకులు బాణాల రాజన్న చైనా బోయిన వెంకన్న, మామునూరు రేణుక, హరీష్, విజయ్,గుండా శ్రీను,మంగమ్మ,సురేష్ తదితరులు పాల్గొన్నారు,

# 58 ఏళ్లు నిండిన అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

## - అనంత్‌రెడ్డి

## - ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన బీజేపీ నాయకులు



చేవెళ్ల, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : 58 సంవత్సరాలు పైబడిన అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేసి ఆర్థిక భరోసా !కల్పించాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.
ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వృద్ధాప్య పింఛన్ల కోసం అర్హులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నా కొత్త లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం చేయూత కింద వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు తదితరుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నేపథ్యంలో వృద్ధుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా దరఖాస్తుల స్వీకరణకు స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాలని కోరారు. వృద్ధుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి వృద్ధులకు త్వరితగతిన సామాజిక భద్రత కల్పించడంతో పాటు పింఛన్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించాలని అనంత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరికే సత్యనారాయణ, జయసింహారెడ్డి గుడుపల్లి మధుసూదన్ రెడ్డి, పత్తి సత్యనారాయణ, పీసరి శ్రీకాంత్ రెడ్డి, సామ కృష్ణారెడ్డి, శ్రీకాంత్, కరుణాకర్, కరికే రవి, ప్రకాష్ , వడ్డే గణేష్, పాగ వెంకటేష్, రాజు, చంద్రయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్.. రాంగ్‌రూట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- గాజులరామారం సర్కిల్ డీసీ కార్యాలయానికి వినతిపత్రం**

**- శ్రీ వేణి ఎంక్లేవ్ నుంచి యూటర్న్ వరకు రాంగ్‌రూట్‌లో వాహనాల రాకపోకలపై ఫిర్యాదు**

**- సర్వే నంబర్ 12లో భూవివాదంపై రెండు రోజుల్లో ఏ.డీ. సర్వే చేయాలని డిమాండ్**

గాజులరామారం, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): గాజులరామారం డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్, రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం గాజులరామారం సర్కిల్ డీసీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. చిత్తరమ్మ ఆలయం సమీపంలోని యూటర్న్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయం ఎదురుగా కాకతీయ టెక్నో స్కూల్ సమీపంలో రహదారి



పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. విద్యార్థులు, స్థానికులు, వాహనదారుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బాలానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును కలిసి ట్రాఫిక్ సమస్యలపై మరో వినతిపత్రం అందజేశారు. శ్రీ వేణి ఎంక్లేవ్ నుంచి చిత్తరమ్మ ఆలయం వద్ద ఉన్న యూటర్న్ వైపు వందలాది వాహనాలు రాంగ్‌రూట్‌లో వస్తున్నాయని, దీనివల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని తెలిపారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.

సర్వే నంబర్ 12పై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వే నంబర్ 12కు సంబంధించి సుమారు నాలుగు ఎకరాల భూమి విషయమై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సాయినాథ్ నేత తెలిపారు. ఈ అంశంపై గతంలో 2025 జూలై 16, ఆగస్టు 23 తేదీల్లో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి, సర్వే నంబర్ 12పై ఏ.డీ. సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. రెండు రోజుల్లోగా సర్వే నిర్వహించకపోతే గాజులరామారం సర్కిల్‌లో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపడతామని అధికారులకు తెలిపారు. ప్రజలకు సంబంధించిన రహదారి, ట్రాఫిక్, భూ సమస్యలను అధికారులు తక్షణమే పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకురాలు రేవతి రాఘవులు, ఉమ్మడి డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ నేత, సీనియర్ నాయకులు శారద, సామంతుల శ్రీనివాస్ పటేల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరం

**- చైర్‌పర్సన్ దేవర సమతావెంకటరెడ్డి**

**- పామేనలో వనమహోత్సవం**

చేవెళ్ల, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): పచ్చదనం పెంపొందించడంతో పాటు నాటిన మొక్కలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకటరెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామేన వార్డులో సోమవారం కౌన్సిలర్ దావల్గారి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రభుత్వ పాఠశాల, సంస్కృతి స్కూల్ ఆవరణల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సమతావెంకటరెడ్డి పాల్గొని పచ్చదనం పెంపునకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం మొక్కల పెంపకాన్ని అలవాటుగా మార్చుకోవాలని కోరారు. పెరుగుతున్న మొక్కలకు అవసరమైన నీరు అందిస్తూ వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పచ్చని వాతావరణం ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్లు శైలజ, కళ్యాణి, మనీషా స్థానిక నాయకులు విజయ్, ఎర్రగోపాల్ సంస్కృతి పాఠశాల ప్రిన్సిపాల్ రెహానా, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసు లేకుండానే బైండోవర్ చేశారంటూ ఫిర్యాదు

**- ఆల్వాల్ తహసీల్దార్ తీరుపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు**

**-విచారణ, వాదనలు వినకుండానే ఏడాది బాండ్ రాయించారని ఆరోపణ**

**- బైండోవర్ రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**




పేట్ బషీరాబాద్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినే అవకాశం కల్పించకుండానే ఏడాది పాటు బైండోవర్ చేశారని ఆరోపిస్తూ ఓ ఎస్సీ వ్యక్తి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఆల్వాల్ మండల తహసీల్దార్ రాములు వ్యవహరించిన తీరుపై విచారణ జరిపి, బైండోవర్ ఉత్తర్వులను రద్దు చేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషన్‌కు సమర్పించిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదుదారు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 791/2026కు సంబంధించి ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తు అధికారిని కలిసి విచారణకు సహకరించాలని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు జారీ చేయాలని న్యాయస్థానం ఆదేశించినట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసుల నుంచి నోటీసు అందుకుని దర్యాప్తునకు సహకరించినట్లు పేర్కొన్నారు.

**పిలిపించి బాండ్ రాయించారని ఆరోపణ**

ఆగస్టు 24న ఆల్వాల్ తహసీల్దార్ ఎదుట హాజరు కావాలని పిలిపించి, ఏడాది పాటు సత్ప్రవర్తనకు బాండ్ రాయించారని ఫిర్యాదులో ఆరోపించారు. అయితే బైండోవర్ చర్యలకు ముందు తనకు ఎలాంటి లిఖితపూర్వక నోటీసు ఇవ్వలేదని, తనపై ఉన్న ఆరోపణలను పూర్తిగా తెలియజేయలేదని తెలిపారు. అలాగే తన వివరణను నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించలేదని పేర్కొన్నారు. చట్టం నిర్దేశించిన ప్రక్రియను, సహజ న్యాయ సూత్రాలను పాటించకుండానే బైండోవర్ చర్యలు చేపట్టారని ఫిర్యాదుదారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తినని, ప్రజా సేవలో ఉన్న అధికారి తన విషయంలో చట్టబద్ధమైన విధానాన్ని పాటించలేదని ఆరోపించారు.

**ఆర్టీఐతో రికార్డుల కోసం ప్రయత్నం**

బైండోవర్ చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఉత్తర్వుల ప్రతులను పొందేందుకు ఆగస్టు 25న తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. అయితే స్పందన రాకపోవడంతో ఆగస్టు 27న మల్కాజిగిరి ఆర్డీవోకు తొలి అప్పీల్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు బైండోవర్ ఉత్తర్వుల పూర్తి ప్రతిని అందించలేదని, సంబంధిత పూర్తి రికార్డులను తహసీల్దార్ కార్యాలయం నుంచి తెప్పించి పరిశీలించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరారు.

**బైండోవర్ రద్దు చేయాలని విజ్ఞప్తి**

తనపై విధించిన ఏడాది బైండోవర్ ఉత్తర్వులను పరిశీలించి రద్దు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను ఆశ్రయించినందుకు తనపై ఎలాంటి ప్రతీకార చర్యలు జరగకుండా రక్షణ కల్పించాలని, జిల్లా కలెక్టర్, ఆర్డీవో నుంచి చర్యలపై నివేదిక తెప్పించాలని కమిషన్‌ను కోరారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ

**సెప్టెంబర్ రెండవ తారీఖు నుండి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ పార్టీ సమరబేరి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి....**

వెయ్యి రోజుల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం యొక్క దగా పాలనపై సెప్టెంబర్ 2వ తారీఖు నుండి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ సమరబేరి కార్యక్రమం పై నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఉ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.ఆనాడు కాంగ్రెస్ నాయకులు స్వయంగా 6 గ్యారెంటీల కార్డులను ముద్రించి ప్రజలకు అందజేస్తూ, ఈ కార్డును జాగ్రత్తగా దాచుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నింటినీ అమలు చేస్తామని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాటలను నమ్మిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకొచ్చారని తెలిపారు.రాష్ట్ర జనాభాలో సగభాగం ఉన్న మహిళలను ఆకట్టుకోవడానికి ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం అందిస్తామని కాంగ్రెస్ హామీ



ఇచ్చిందని, కానీ ఆ హామీ పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రస్తుతం అందుతున్న పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్నా పెన్షన్ పెంపు హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు ద్వారా అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచి ఎకరాకు రూ.15,000 అందిస్తామని, అవసరమైతే అదనపు పంటలకు కూడా సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.అయితే నేడు రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సహాయం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రైతు బీమా ప్రీమియం, యూరియా సరఫరా, సాగునీరు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ వంటి అంశాల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని, కానీ ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతుల్లో అనేక సందేహాలు, ఆందోళనలు ఉన్నాయని పేర్కొన్నారు.సాగునీటి రంగాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారు తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల మరమ్మతులు, నిర్వహణ, నీటి నిల్వ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో రైతాంగం యూరియా కొరత, సాగునీటి సమస్యలు, భూముల నిషేధిత జాబితా వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు

రాష్ట్రంలోని అనేక భూములు 22-ఎ నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రైతులు, భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని, ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని అన్నారు. కానీ నేటికీ నిరుద్యోగ యువత ఆశించిన స్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగలేదని విమర్శించారు.

విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు టీసీలు, ఇతర ధ్రువపత్రాల కోసం కళాశాలలకు వెళ్లినప్పుడు ఫీజు బకాయిల సమస్య కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెడికల్ బోర్డుల ద్వారా అనేక మంది కార్మిక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించామని, ప్రస్తుతం ఆ ప్రక్రియలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి నిలిచిపోయాయి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.

# బాల్కొండ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం విజ్ఞప్తి - జిల్లా అధ్యక్షులు

బాల్కొండ విజన్ ఆంధ్ర (ఆర్. సి) (నిజామాబాదు జిల్లా) ఆగస్ట్ 31:-నిజామాబాదు జిల్లా బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గం కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు జాప్యం ఏమిటని నిజామాబాదు జిల్లా మన హక్కుల కౌన్సిల్, సామాజిక సాంస్కృతిక విభాగం బి. నర్సింగ్ రావు,అధ్యక్షులు డి. పవన్ కుమార్, ఉపాధ్యక్షులు సోమవారం రోజు ప్రజా వాణి లో జిల్లా కలెక్టర్,గారికి సమాచార చట్టం 2 వ అప్పీల్ కింద పూర్తి సమాచారం కోసం వినతి పత్రాలు సమర్పించారు.ఈ విషయంలో 06-07-2026. మొదటి 06-07-2026 ఇవ్వగ జిల్లా విద్యాశాఖ నుండి ఎలాంటి సమాధానం రాలేనందున ఇదే విషయాన్ని సమాచార హక్కు చట్టం కమిషనర్, గారికి కూడా అభ్యర్థన చేశారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్ బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గం కేంద్రంలో కాకుండ ఎలాంటి సౌకర్యాలు లేని మారుమూల కూ గ్రామం పేరును ఎలా ఎంపిక చేసారని ఫిర్యాదులో ప్రశ్నించారు.దీంతో బాల్కొండ ప్రజల్లో వ్యతిరేకత నే కాకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఫిర్యాదు లో వివరించారు.ఇది ఇలా ఉండగా ప్రభుత్వం సూచించిన నిబంధనలు అన్ని ఉన్న జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల బాల్కొండ "తెలంగాణ పబ్లిక్ స్కూల్ బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం, జాతీయ రహదారి ఆనుకొనే ఉంది. రవాణా రోడ్డు సౌకర్యాలు ఉన్నాయి. బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రానికి ఆనుకొని ముప్కాల్, రేంజర్ల, మెర్దాడ్ కమ్మర్పల్లి ఏరుగట్ల మండలాలు ఉన్నాయి పై మండ లాలకు రవాణా సౌకర్యాలు ఉన్నాయి. బాల్కొండ జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల లో తెలుగు, ఇంగ్లీష్ ఉర్దూ మీడియం విద్యార్థిని విద్యార్థుల సంఖ్య (340)ఉపాధ్యాయుల సంఖ్య (22),గదుల సంఖ్య (20)పైనే ఉన్నాయి.ఉన్నత పాఠశాలకు ఉన్న క్రీడ మైదానం (మినీ స్టేడియం) పూర్తి చదునుగ (లెవెల్ )తో 4:00 ఎకరాల భూమి ఉంది.ఈ పాఠశాలలో సైన్స్, కంప్యూటర్, మాథ్స్ ల్యాబులతో అన్ని హంగులతో ఉంది.బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడమటి వైపు నకాష్ గల్లీ లోని ఉన్న ప్రభుత్వ భూములని పూర్వపు ఇన్చార్జ్ తహసిల్దార్ వినోద్ కుమార్ ప్రభుత్వ సర్వేయర్ తో పాటు పూర్వపు వి.డి.సి సభ్యులు కలిసి తేదీ 16 -12-2022 మరియు 17-12-2022 రోజుల్లో నకాష్ గల్లీ లోని గుట్టలను ఆనుకొని సర్వే చేసి ప్రభుత్వ భూముల ను గుర్తించారు.ఇదే విషయాన్ని బాల్కొండ తహసీల్దార్ గారు జిల్లా కలెక్టర్ గారికి రిపోర్టు రూపంలో అంద జేయగ పూర్వపు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు, ఐ. ఏ. ఎస్, గారు పై సర్వే నంబర్ల భూము లన్నియు 1958-61 సేత్వార్, పహాణీ గ గుర్తిస్తూ ప్రభుత్వ భూములని ఉత్తర్వులను జారిచేశారని ఈ భూముల్ని కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు కేటాయిస్తే స్కూల్ కు కావలసిన ప్లే గౌండ్స్ అన్ని ఇదే భూముల్లో ఏర్పాటు అవుతాయని వారు గుర్తు చేసారు.ప్రభుత్వ పరంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మరో విద్యా సంస్థ అయిన "ఇంటి గ్రేటెడ్ పాఠశాల" కోసం బాల్కొండ లో ప్రభుత్వ భూములు అపారంగా, బాల్కొండ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఇప్పుడు ఉన్న మోడల్ స్కూల్ ప్రక్కన గల ముక్కిడి ఫకీర్, బోదపల్లి గుట్టలతో కలిపి వందల ఏకరాల ప్రభుత్వ భూమి ఉంది. గుట్టల్ని జే. సి. బి. లతో చదును చేసి ఇంటి గ్రేటెడ్ స్కూల్ ను ఏర్పాటు చేస్తే బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గానికి గుర్తింపు ఇచ్చినట్లు ఉంటుందని వారు వినతి పత్రంలో విజ్ఞప్తి చేసారు.

## చేవెళ్ళ లో 'మన నేచురల్ డైరీ' ప్రారంభోత్సవం

చేవెళ్ల,ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): ప్రజలకు నాణ్యమైన, సహజసిద్ధమైన పాల ఉ లు అందుబాటులో ఉండేలా వ్యాపార సంస్థలు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకటరెడ్డి అన్నారు. చేవెళ్ల గ్రామంలోని రోడ్డు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మన నేచురల్ డైరీ' ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమతవెంకట్ రెడ్డి మాట్లాడుతూ... నాణ్యమైన ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్థానికంగా ఇటువంటి సంస్థలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. డైరీ నిర్వాహకులు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. అనంతరం డైరీ నిర్వాహకులను అభినందించి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్లు మంగలి కళ్యాణియాదగిరి బండారి శైలజఆగిరెడ్డి, అత్తెల్లి మనిషాఅనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటితో నెరవేరిన సొంతింటి కల

ముధోల్ ఆగస్టు 31: విజన్ ఆంధ్ర : ముధోల్ :మండలంలోని అష్ట గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎడ్ల వందన--పెంటన్న దంపతుల సొంతింటి కల సాకారమైంది. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటికి గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ హాజరై గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుల లావణ్య మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఎడ్ల వందన--పెంటన్న దంపతులను సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అలాగే గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన అతిథులను ఇంటి యజమానులు సన్మానించారు.



ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సావిత్రి కోటయ్య, వార్డు సభ్యులు సురేష్, చిన్నన్న, ఈజీఎస్ సిబ్బంది రాజేశ్వర్, యువ నాయకులు మురళి, సేవాదళ్ అధ్యక్షుడు అనిల్, గాయకులు దిగంబర్, ఎస్.కె. మీనాజ్, సాయన్న, లక్ష్మణ్, వడ్ల బ్రహ్మంతో పాటు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల చదువుతో చెలగాటం ఆపాలి

**పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి.కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్.**

భూపాలపల్లి జిల్లా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ) రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల పట్ల వివక్ష చూపకుండా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఎంతో కీలకమైనవని అన్నారు. ప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించలేక కొంతమంది విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షలు, సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి విద్యార్థులే రేపటి నూతన సమాజ నిర్మాతలు" అనే విషయాన్ని పాలకులు గుర్తించి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని దేవేందర్ కోరారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయిలుగా ఉంచడం వల్ల పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని



అన్నారు.గత విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎంత ఉన్నాయో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా, కళాశాలల వారీగా బకాయిల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యానికి కారణం ఏమిటి, బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తారు, ఫీజులు చెల్లించలేని విద్యార్థులపై కళాశాలలు ఒత్తిడి చేయకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఈపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, ఎప్పుడు చెల్లింపులు జరుగుతాయి అనే వివరాలు విద్యార్థులకు స్పష్టంగా తెలిసేలా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చాలని దేవేందర్ కోరారు. దరఖాస్తుల పరిశీలన, కళాశాలల ధృవీకరణ, సంక్షేమ శాఖల పరిశీలన, నిధుల విడుదలకు నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించాలని అన్నారు. దరఖాస్తులు తిరస్కరించిన సందర్భంలో అందుకు గల కారణాలను కూడా విద్యార్థులకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో విద్యార్థుల చదువు, పరీక్షలు, సర్టిఫికెట్లను అడ్డుకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.

కాస్మెటిక్ చార్జీలు పెంచాలి

ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, దుస్తులు తదితర విద్యా సంబంధిత ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యార్థులకు అందుతున్న కాస్మెటిక్ చార్జీలను కూడా ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని రాదండి దేవేందర్ డిమాండ్ చేశారు. పాత మొత్తాలతో విద్యార్థుల రోజువారీ అవసరాలు తీరడం లేదని అన్నారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని కాస్మెటిక్ చార్జీలను ప్రతి సంవత్సరం సమీక్షించే విధానాన్ని ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, నిర్వహణ భత్యాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.పేద విద్యార్థుల చదువు ఆగిపోతే అది ఒక్క కుటుంబానికి మాత్రమే నష్టం కాదని, సమాజం ఒక ప్రతిభావంతుడిని కోల్పోయినట్లేనని దేవేందర్ అన్నారు. విద్యపై చేసే ఖర్చును ప్రభుత్వం భారం కాకుండా భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలని సూచించారు.స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు ప్రభుత్వం కాలపరిమితితో కూడిన షెడ్యూల్‌ను ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తిగా చెల్లించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ కో కన్వీనర్లు అజ్మీర సమయానాయక్ జోగుల సమ్మయ్య శీలపాక మహేష్ బాలు గుండ్ల ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎం.ఏ. లతీఫ్‌ను ఎంపిక చేయాలి



### ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజల డిమాండ్

భైంసా :ఆగష్టు 31:విజన్ ఆంధ్ర భైంసా: భైంసా పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం పరిశీలకుడు ఎం.ఏ. లతీఫ్‌ను భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు ఈ మేరకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు 18 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఎం.ఏ. లతీఫ్, పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని నాయకులు పేర్కొంటున్నారు. ఇన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన ఆయనకు తగిన రాజకీయ గుర్తింపు కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని వారు అభిప్రాయపడుతున్నారు.

తానూర్, కుబీర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మైనారిటీ వర్గానికి దక్కలేదని తెలిపారు. ఈసారి ఎం.ఏ. లతీఫ్‌కు చైర్మన్ పదవి కేటాయించడం ద్వారా మైనారిటీ వర్గానికి రాజకీయ ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన లతీఫ్ ఈ పదవికి అర్హుడని స్పష్టం చేశారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ లభించకపోయినా కాంగ్రెస్ పార్టీని వీడకుండా, పార్టీ బలోపేతం కోసం ఎం.ఏ. లతీఫ్ తనవంతు కృషి కొనసాగించారని నాయకులు గుర్తుచేస్తున్నారు. పదవి, టికెట్ వంటి రాజకీయ అవకాశాలు లభించకపోయినా పార్టీకి విధేయంగా కొనసాగిన ఆయన సేవలను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించాలని కోరుతున్నారు.

ముధోల్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. "పార్టీ కోసం ఇన్నేళ్లుగా పనిచేసిన నాయకుడికి తగిన గుర్తింపు ఇవ్వాలి. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చి ఎం.ఏ. లతీఫ్‌కు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేస్తున్నారు.

మైనారిటీ నాయకులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఈసారి ఎం.ఏ. లతీఫ్‌కు తగిన రాజకీయ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆయనకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తే మైనారిటీ వర్గంలో పార్టీపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొంటున్నారు.

ఎం.ఏ. లతీఫ్‌ను భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయాలనే డిమాండ్‌కు ప్రజలు, కాంగ్రెస్ నాయకుల నుంచి మద్దతు పెరుగుతుండటంతో ముధోల్ నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఇకపై ఎరువులు యాప్ ద్వారానే

# సెప్టెంబర్ 1 నుంచి ఖీఖీ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్

మల్హర్, ఆగస్టు 31 విజన్ ఆంధ్ర :సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఎరువుల కొనుగోలు ప్రక్రియలో కొత్త విధానం అమల్లోకి రానుందని మండల వ్యవసాయ అధికారిణి బొల్లపెల్లి శ్రీజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్లేస్టోర్ నుంచి ఎఫ్ఎఫ్ ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, తమ పంట వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం యూరియా, కాంప్లెక్స్ సహా అవసరమైన అన్ని రకాల ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకుని పొందాలని కోరారు.రైతులందరూ ఈ కొత్త విధానాన్ని గమనించి ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి బొల్లపెల్లి శ్రీజ తెలిపారు.

# ప్రజల కోసం ప్రజావాణి కార్యక్రమం..

### - ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తేగలరు

### - ఎంపీడీఓ మహబూబ్ అలీ

కుకునూరుపల్లి, ఆగష్టు 31,విజన్ ఆంధ్ర : ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ అలీ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్, పెన్షన్, రెవిన్యూ, హౌసింగ్ శాఖలకు సంబంధించిన మొత్తం ఎనిమిది దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు ఫిర్యాదులను పంపడం జరిగిందన్నారు.

# బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ కావాలి

పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ ఏ విధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు కూడా అదే ఆశీర్వాదం ఇవ్వాలని కవిత నిజామాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సొంత గడ్డపై సొంత మనుషులను చూసి భావోద్వేగానికి లోనైన కవిత

తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజల జీవితాల్లో అనుకున్న స్థాయిలో మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అని చెప్పిన బీఆర్ఎస్ హయాంలో నలుగురి ఇండ్లు మాత్రమే బంగారం మాయం అయ్యాయని చెప్పారు. ప్రజల కోసం ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. బంగారు తెలంగాణ కాదు, ఇప్పుడు కావాల్సింది బహుజన తెలంగాణ అని కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సి ఉందన్నారు. అందుకోసం చిత్తశుద్ధితో పనిచేసేందుకే తాను పార్టీ పెట్టానన్నారు. పదవుల కోసమైతే ఏ రాజకీయ పార్టీలోకైనా వెళ్లవచ్చుని...కానీ తాను చూడని పదవులు లేవన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న పతంతోనే నేను పార్టీ పెట్టానన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత తన సొంతగడ్డ నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని చెప్పారు. సొంత గడ్డపై సొంత మనుషలను చూసి కవిత భావోద్వేగానికి లోమయ్యారు. ఎంత ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగటం లేదంటూ ఈ సందర్భంగా ఆమె అన్నారు. అలాగని తనను పిరికిదాన్ని అనుకోవద్దని... ఆడబిడ్డల గుండెల్లో బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని చెప్పారు. ఇక గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ గెలిపించి తనను ఎలా ఆశీర్వదించారో అదే విధంగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏ తప్పు చేయకున్న సరే తీహార్ జైల్లో పెట్టినప్పటికీ ధైర్యం సడలలేదని, దారి తప్పలేదని కవిత గుర్తు చేసుకున్నారు. అప్పుడే తాను తప్పు చేయలేదని, నిజామాబాద్ నిప్పు బిడ్డనని చెప్పానని అన్నారు. ఈడీ, సీబీఐ తనను ఇబ్బంది పెట్టిన సమయంలో అండగా ఉండాల్సిన బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యంగా తనను బయటకు పంపించిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పై కక్షతో తనను అరెస్ట్ చేశారని చెప్పిన బీఆర్ఎస్ పెద్దలు ఆ తర్వాత ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు పంపిన సరే తాను ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని అందుకే పార్టీ పెట్టానని కవిత చెప్పారు.

కాంగ్రెస్ పై పోరాటం.. టీఆర్ఎస్ నిర్మాణం

తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం ఐదు కీలకాంశాలతో తాము ముందుకు వెళ్తున్నట్లు కవిత చెప్పారు. పాంచజన్యం పేరుతో ఐదు కీలకాంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నామన్నారు. ఉచిత విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి ఇస్తామన్నారు. ఇందుకోసం డబ్బులు ఎక్కడివి అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తారని...కానీ మన ఆదాయమే ఏటా 2 లక్షల కోట్లు ఉందని కవిత అన్నారు. అందులో లక్ష కోట్లు పెడితే ఉచిత విద్య, వైద్యం అందించవచ్చని చెప్పారు. బహుజన తెలంగాణ అంటే అన్ని కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ఏ కులం వెనుకబడిన తెలంగాణ ముందుకు వెళ్లదని చెప్పారు. అగ్రవర్ణాల్లో పేదలు కూడా బాగుపడాలని కవిత అన్నారు. అందుకోసం ఓ వైపు కాంగ్రెస్ పార్టీతో పోరాటం చేస్తూనే మరోవైపు టీఆర్ఎస్ పార్టీని నిర్మాణం చేసుకుంటామన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో ఐదు అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేపటితో వెయ్యి రోజులైనప్పటికీ ఇప్పటికీ వాళ్లు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కవిత విమర్శించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన పార్టీని నిలదీయాలా వద్దా అని ప్రజలను ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్లు పెట్టే ఈ ముఖ్యమంత్రి...గెలిచిన తర్వాత తిట్ల దండకం అందుకుంటారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజల జీవితాలు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేళ్లలో బీఆర్ఎస్ ప్రజల సొమ్ము దోచుకుంది

బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అడ్డగోలుగా అవినీతికి పాల్పడిందని కవిత మండిపడ్డారు. పదేళ్లలో దోచుకున్న డబ్బులను బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ లెక్కపెడుతున్నారని చెప్పారు. ఆ డబ్బు అహంకారంతో టీఆర్ఎస్ పార్టీ నాయకులను బెదిరిస్తున్నారని కవిత మండిపడ్డారు. బెదిరిస్తే భయపడే రోజులు పోయాయని బీఆర్ఎస్ ను హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రధాన ప్రతిక్షంగా ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు సైలెంట్ గా ఉందని కవిత ప్రశ్నించారు. అవినీతి కారణంగా కాంగ్రెస్ తో బీఆర్ఎస్ మిలాఖత్ అయ్యిందన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే చూస్తే ప్రజలు సమస్యల్లో ఉన్నప్పటికీ ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎందుకు ప్రజల కోసం పోరాటం చేయటం లేదో చెప్పాలన్నారు. జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అక్రమాలపై కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ తో బీఆర్ఎస్ కు ఉన్న అండర్ స్టాండింగ్ ఏంటో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అవినీతిలో నాకు పాత్ర లేదా అని చాలా మంది ప్రశ్నిస్తారని కవిత అన్నారు. కానీ జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలు ఎమ్మెల్యేలు కాకముందు ఉన్న ఆస్తులు, ఆ తర్వాత వారి ఆస్తులను చూస్తే వారు ఎంత సంపాదించారో తెలుస్తుందన్నారు. తాను మాత్రం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఉన్న కంపెనీ అమ్ముకున్నానని కవిత అన్నారు. పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని....అలాంటి నాయకులను మళ్లీ గెలిపిద్దామా అని కవిత ప్రజలను ప్రశ్నించారు.

ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను

నిజామాబాద్ జిల్లా నాయకుడు ప్రశాంత్ రెడ్డి పై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రితో తనకు దూరం చేసిన వ్యక్తి ఆయనేనని అన్నారు. తండ్రి, కూతురును పాపిన వ్యక్తి ప్రశాంత్ రెడ్డేనని చెప్పారు. హరీష్ రావు, సంతోష్ రావు లను అయిన క్షమిస్తానేమో గానీ ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించనని కవిత అన్నారు. తన ఉసురు కచ్చితంగా ఆయనకు తగులుతుందన్నారు. ప్రశాంత్ రెడ్డిని పెద్ద కొడుకులా చూసుకొని పిలిచి అన్నం పెట్టిన కేసీఆర్ కు అన్యాయం చేసే ప్రయత్నం చేశాడన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయిన రెండో రోజే కాంగ్రెస్ లోకి వెళ్లే ప్రయత్నం చేశాడని చెప్పారు. ఆయను గెలిపించేందుకు తాను ఎంతో కష్టపడ్డానని, మంత్రి పదవి కూడా వచ్చిందని చెప్పారు. ఇంకా ఏం తక్కువైందని కాంగ్రెస్ లోకి వెళ్లే ప్రయత్నం చేశాడో చెప్పాలన్నారు. నిజామాబాద్ లో బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలను నేను గెలిపిస్తే...నన్ను వాళ్లు ఓడించారంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ ప్రజలే నా ధైర్యం

నిజామాబాద్ ప్రజలే నా ధైర్యమని కవిత చెప్పారు. తనను ఎంపీగా, ఎమ్మెల్సీగా ఇక్కడి ...

## శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాం ఏకగ్రీవ ఎన్నిక

మల్లంపల్లి, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనతో మల్లంపల్లి మండలంలోని శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాకిటి రామకృష్ణారెడ్డి, గ్రాజూ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, జోషి, రాము, జింక వేణు తదితరులు హాజరయ్యారు.

నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా కొట్టే ఆనందం, ప్రధాన కార్యదర్శిగా పంచగిరి రాజు, సహాయ కార్యదర్శిగా బానోతు మోహన్, కోశాధికారిగా బిలావత్ దేస్యను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అజ్మీర రాజేందర్, గుగులోతు బిక్షపతి, గుగులోతు సుందర్, తోట కిరణ్ రాజ్, దాసరి రాజయ్య, మొగిలగాని రమేష్, బిలావత్ దస్రు తదితరులు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో శ్రీనగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగింత

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 31 ( విజన్ ఆంధ్ర) ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న ఏడు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఈరోజు ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో బాధితులకు ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సి ఈ ఐ ఆర్. సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సాంకేతికను ఉపయోగించి ఈ మొబైల్ ఫోన్లను పోలీసులు విజయవంతంగా ట్రాక్ చేశారు రికవరీ చేసిన ఫోన్లు రెండు సంవత్సరాల క్రితం పోయినవి అలాగే యాడదిలోపు కాలనో పోయినవి ఐదు మొబైల్స్ ఉన్నాయి మొబైల్ ఫోన్లు అందుకున్న బాధితులు. హైమత్ అలీ వెంకటకృష్ణ మొహమ్మద్ హైముద్దీన్ గుమ్మిరియాల శ్రీకర్ నేరడి లింగారెడ్డి రాజేష్ రమేష్ ఉన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని దీనివల్ల ఫోన్లు దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయడంతో పాటు తిరిగి స్వాధీనం చేసుకోవడం సులువు అవుతుందని పోలీసులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు పోయిన తమ ఫోన్ లను తిరిగి అప్పగించి నందుకు బాధితులు ఆర్మూర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'వైభవంగా ఆలయ వార్షికోత్సవం'

మందమర్రి, రామకృష్ణాపూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు స్వామి వారి అభిషేకం,అష్టోత్తర హారతి,నవగ్రహారతి, గణపతి పూజ,ఆవాహిత లక్ష్మీ గణపతి పూజ,పూర్ణ హారతి,తీర్థ ప్రసాద వితరణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆసుపత్రి డివైసిఎంఓ అడ్మిన్ మధుకుమార్ దంపతులు ప్రత్యేక హోమంలో పాల్గొని పూజలు చేశారు.



## కొత్తతాండా బీటీ రోడ్డు కోసం...... జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం.....

బీబీనగర్:31/ఆగస్టు (విజన్ ఆంధ్ర) : గుర్రాలదండి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 184లో కొత్తతాండా బీటీ రోడ్డు నుంచి మూసీ వాగు వరకు ఉన్న రహదారికి సంబంధించిన రికార్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఈరోజు జిల్లా కలెక్టర్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ రహదారి కొత్తతాండా ప్రజలు, రైతులకు ఎంతో ముఖ్యమైనదని, వ్యవసాయ పనులతో పాటు నిత్య రాకపోకలకు ఈ మార్గాన్ని ప్రజలు వినియోగిస్తున్నారని కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. రహదారికి సంబంధించిన సర్వే రికార్డులు, గ్రామపంచాయతీ తీర్మానం తదితర పత్రాలను పరిశీలించి, ప్రభుత్వ రికార్డుల్లో రహదారి వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కోరారు.

అలాగే రహదారి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, ప్రజలకు శాశ్వత



రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపి నాయక్ , మాజీ సర్పంచ్ లాలు నాయక్ , ఉపసర్పంచ్ శ్రీను , గ్రామ పెద్దలు కవి , భిక్ష, పంత, దరవత్ గణేష్ శివ నాయక్ తదితర గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజల సమస్యను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి, రహదారికి సంబంధించిన రికార్డులు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## నూతన పెన్షన్ల దరఖాస్తు గడువు మరో 15 రోజులు పొడిగించాలి- సిపిఎం

**బండారు శ్రీరాములు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి**

బీబీనగర్: 31/ఆగస్ట్ (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ల దరఖాస్తు గడువును మరో 15 రోజులు పొడిగించాలని సోమవారం రోజున సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో సూపరెంట్ అంబటి శివకుమార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఆసరా పథకం కింద ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల మందికి నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించింది ప్రకటించి ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియను ఈనెల9 వ తేదీ నుండి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారన్నారు కానీ నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల ఒత్తిడి కారణంగా అనేక మంది వారి దరఖాస్తులు అందజేయ లేక పోయారన్నారు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరాల నూతన పెన్షన్లు మంజూరు చేస్తున్నందున లక్షలాది మంది అర్హత కలిగిన పేదలు ఆసరా పెన్షన్ల కొరకు ఎదురు చూస్తున్న మరోవైపు కుల, ఆదాయ, ధ్రువీకరణ, పత్రాల కోసం అనేక మంది ఒకేసారి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడం వలన సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆన్లైన్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అనేక మంది పెన్షన్లకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొంతమంది దరఖాస్తు చేసుకోవడానికి అర్హత కలిగిన పేదలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం పునరా ఆలోచన చేసి పెన్షన్లు దరఖాస్తు గడువును మరో 15 రోజులు పోడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రకటించిన విధంగా వృద్ధులు, వితంతువులకు రూ. 4000/పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాసు సిపిఎం పట్టణ నాయకులు పంజాల జంగయ్య, చెట్టబోయిన కనకయ్య, కుంట్ల యాదిరెడ్డి, అంగడిసోమయ్య, గోకుల దుర్గయ్యతదితరులు పాల్గొన్నారు

# ముధోల్ కళాశాలకు గోడేదీ..?

**- విద్యార్థుల భద్రత గాలికేనా!**

**కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలి**

**బైంసా సబ్ కలెక్టర్కు ఏఐపీఎస్యూ వినతి.. గడపాలి పరమేష్ డిమాండ్**

బైంసా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించి విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐపీఎస్యూ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ (ఐఏఎస్)కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఏఐపీఎస్యూ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ మాట్లాడుతూ.. కళాశాల చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో బయటి వ్యక్తులు, అసంబంధిత వ్యక్తులు యథేచ్ఛగా ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థినుల భద్రతకు ఇది తీవ్ర ఆందోళనకర అంశమని పేర్కొన్నారు.

తరగతులు జరుగుతున్న సమయంలో బయటి వ్యక్తుల సంచారం వల్ల విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలుగుతోందని, ప్రశాంతమైన విద్యా వాతావరణం దెబ్బతింటోందని తెలిపారు. కళాశాల సమయం ముగిసిన అనంతరం, రాత్రివేళల్లో, సెలవు రోజుల్లో ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల ఎదురవుతున్న భద్రతా సమస్యలను కళాశాల ప్రిన్సిపాల్ సైతం అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు పరమేష్ తెలిపారు. విద్యార్థుల భద్రతతో పాటు కళాశాల ఆస్తుల పరిరక్షణ, ప్రశాంతమైన విద్యా వాతావరణం కోసం తక్షణమే నిధులు మంజూరు చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలని సబ్ కలెక్టర్ను కోరారు.

విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఏఐపీఎస్యూ నాయకులు డిమాండ్ చేశారు.

## బట్టుగూడెం గ్రామంలో బోనాల సందడి......

**సదుపాయాలు కల్పించిన గ్రామ సర్పంచ్ దాస మౌని లతా శ్రీశైలం**





బీబీనగర్: 31/ఆగస్టు (విజన్ ఆంధ్ర): బట్టుగూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా గ్రామ సర్పంచ్ దాసమౌని లత శ్రీశైలం ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయానికి లైటింగ్ మైక్ సెట్ డప్పుల వాయిద్యాలతో ఘనంగా బోనాలు అమ్మవారికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దాసమౌని వెంకటేష్, వార్డు సభ్యులు రాసాల కల్పనా బసవరాజ్, కొత్త గోపాల్ దాస మౌని రమ కృష్ణ, కాసుల భార్గవి మహేష్ గ్రామ నాయకులు రసాల పోశయ్య, నర్ర మారయ్య, దాసమని కిషన్ సత్తయ్య , ఎం జంగయ్య, బి రామాంజనేయులు,ఎన్ విజయ్, ఎన్ కృష్ణ ,జి రాజు, పి గోపి గ్రామ పెద్దలు యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మల్హర్‌లో నూతన గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక



**- మూడు గ్రామ శాఖలకు కొత్త అధ్యక్షుల ఎంపిక.. జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు**

మల్హర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : మల్హర్ మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని దుబ్బపేట, అడ్వాలపల్లి, పెద్దతుండ్ల గ్రామ శాఖ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దుబ్బపేట గ్రామ శాఖ అధ్యక్షుడిగా అజ్మీర సతీష్ నాయక్, అడ్వాలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా అజ్మీర రాజు, పెద్దతుండ్ల గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాళ్ల రవీందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బడితెల రాజయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప ముండయ్య, సర్పంచ్ బండారి నరసింగరావు, మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహాల రావు, మండల రాహుల్, మాజీ సర్పంచ్ రాజు నాయక్, కిషన్ నాయక్తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభ అనంతరం శుద్ధీకరణపై ఫిర్యాదు

## సమగ్ర దర్యాప్తు చేపట్టాలని టీపీసీసీ ఎస్సీ విభాగం డిమాండ్

ముధోల్ :ఆగష్టు 31:విజన్ ఆంధ్ర : ముధోల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ అనంతరం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామలీలా మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని టీపీసీసీ ఎస్సీ విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్‌కు ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ పాత్రపైనా విచారణ చేపట్టాలని కోరారు. ఈ ఘటనలో కుల వివక్ష, అంటరానితనానికి సంబంధించిన అంశాలు నిర్ధారణ అయితే, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్, కార్యదర్శి బాసిర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు విశ్వంబర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిష్టయ్య, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, మాజీ ఎంపీటీసీ , మాజీ సర్పంచులు సాయినాథ్, గౌతమ్, నాయకులు సంజు, సామీ, ధర్మేందర్, జావీద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఎస్ పెన్షన్ విద్రోహ దినంను విజయవంతం చేయండి

**టిజిఇజేఏసి మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**

మంచిర్యాల టౌన్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజీఇజేఏసి) మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మరియు సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, పెన్షనర్ ల అసోసియేషన్ మరియు వివిధ శాఖల ప్రతినిధులతో ఈ రోజు టీఎన్జీవో భవన్ లో మంచిర్యాలలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 మంగళవారం రోజున ఐడిఓసి నస్పూర్ లో చేయు పెన్షన్ విద్రోహ దినం ను విజయవంతం చేయుటకు సన్నాహక సమావేశము నిర్వహించారు. ఈ సమావేశం లో టిజిఇజేఏసి మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ న ఐడిఓసి నస్పూర్ లో నిర్వహించు పెన్షన్ విగ్రహా దినం లో జిల్లా లోని అన్ని ఉద్యోగ సంస్థల ఉద్యోగులు అటెండర్ నుంచి మొదలుకొని జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొని 2004 సంవత్సరము సెప్టెంబర్ 1 తేదీ నుంచి అమలు అవుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తించే సిపిఎస్ వ్యవస్థను రద్దుచేసి పాత పెన్షన్ ఓపిఎస్ అమలు చేయాలని సిపిఎస్ ద్వారా ఉద్యోగుల కుటుంబాలు చిన్నభిన్నమై రోడ్డున పడుతున్నాయి కాబట్టి ప్రభుత్వాలు అర్థం చేసుకొని పాత పెన్షన్ వ్యవస్థను తీసుకురావాలని మరియు ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్‌లో ఉన్న పిఆర్సి, ఇహెచ్ఎస్, పెండింగ్ డిఏలు మరియు పెండింగ్ 12 వేల కోట్ల బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘాలన్నీ ఐక్యంగా కృషి చేయాలని సెప్టెంబర్ ఒకటో తేదీన జిల్లాలోనీ అందరూ ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఒకటవ తేదీన ఐడిఓసి కార్యాలయం నస్పూర్ , సబ్ కలెక్టర్ కార్యాలయం బెల్లంపల్లి మంచిర్యాల జిల్లాలోని అన్ని తాసిల్దార్ కార్యాలయం లో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద సెప్టెంబర్ ఒకటో తేదీన మధ్యానం 1.00 గంటలకు పెన్షన్ విద్రోహ దినం చేయాలని తెలిపారు. ఈ సన్నాహక సమావేశములలో టిజిఇజేఏసి మంచిర్యాల జిల్లా కో చైర్మన్ లు శ్రీనివాస్ రావు దేశ్ పాండే, బట్టారి వెంకటేశ్వర్లు, సుమిత్, పుప్పాల హనుమంతరావు,శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, దుర్గా ప్రసాద్, భూముల రామ్మోహన్, పత్తి సత్తయ్య డిప్యూటీ చైర్మన్ బొడ్డు శ్రావణ్ కుమార్, సుధాకర్, వైస్ చైర్మన్ లు సూరినేని గంగాధర్, ఒడిగ కృష్ణ,బి రవీందర్ ఎస్ కిషన్, ఏ సునీత, నాగుల గోపాల్, మోసిన్ కోశాధికారి సతీష్ కుమార్ వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల మరియు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే జ్ఞానం పెరుగుతుంది

**-యువతకు ఉపయోగపడేలా ఆంగ్ల వ్యాకరణ పుస్తక రచన**

**-విశ్రాంత అధ్యాపకుడు సారథి రమేష్‌కు అభినందనలు**

ముధోల్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆంగ్ల వ్యాకరణాన్ని వివరిస్తూ ముధోల్‌కు చెందిన విశ్రాంత అధ్యాపకుడు, ఆంగ్ల భాషా నిపుణుడు సారథి రమేష్ రచించిన పుస్తకాన్ని సోమవారం స్థానిక రబింద్రా ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించడం ఎంతో అవసరమన్నారు. సారథి రమేష్ సాధారణ భాషలో, యువతకు సులభంగా అర్థమయ్యే విధంగా పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పుస్తకం విద్యార్థులు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. జ్ఞానమే శక్తి అని పేర్కొంటూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం వంటి మహనీయులు పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానాన్ని సంపాదించి ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. వారి ఆలోచనలు, ఆశయాలను తెలుసుకుని



వారి మార్గంలో నడవాలంటే జ్ఞానాన్ని సంపాదించుకోవడం ఎంతో అవసరమన్నారు.

చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకుంటే ఆలోచనా శక్తి, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని తెలిపారు. యువత తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి పుస్తకాలను చదవాలని సూచించారు.

అనంతరం పుస్తక రచయిత సారథి రమేష్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశ మందిరంలో అపరిచితుడి ప్రవేశం

**- అనుమతి లేకుండా వీడియోలు చిత్రీకరిస్తున్నాడని కౌన్సిలర్ల ఆరోపణ**

**- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

బెల్లంపల్లి, ఆగస్టు 31 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశ మందిరంలోకి అనుమతి లేకుండా ఓ అపరిచిత వ్యక్తి ప్రవేశించి వీడియోలు చిత్రీకరిస్తున్నాడని కొందరు కౌన్సిలర్లు ఆరోపించారు. సోమవారం మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమావేశంలో ఉన్న సమయంలో సంబంధం లేని వ్యక్తి సమావేశ మందిరంలోకి ఎలా ప్రవేశించారంటూ వారు ప్రశ్నించారు. బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 34 మంది కౌన్సిలర్లు ఉండగా.. వారిలో 21 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారని తెలిపారు. సమావేశ మందిరంలోకి మీడియా ప్రతినిధులను సైతం అనుమతించడం లేదని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో మున్సిపాలిటీతో సంబంధం లేని వ్యక్తి కౌన్సిలర్లతో సమానంగా కూర్చొని రహస్యంగా వీడియోలు చిత్రీకరించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి అనుమతి లేకుండా సమావేశ మందిరంలోకి ప్రవేశించిన వ్యక్తి లోపలికి ఎలా వచ్చారు? ఎవరు అనుమతించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా వీడియోలు చిత్రీకరించినట్లు తేలితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశ మందిరంలో భద్రత, క్రమశిక్షణకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. భవిష్యత్‌లో అనధికార వ్యక్తులు సమావేశ మందిరంలోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారుల వివరణ కోరగా.. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. దీంతో ఈ ఘటనపై మున్సిపల్ అధికారుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

# మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) ఆగస్టు 30: మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా స్వర్ణకార సంఘం నూతన జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జీడిమెట్ల గ్రామంలోని బ్రహ్మంగారి గుట్ట సమీపంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ విజయమూడి రాఘవాచారి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అఖిల భారత సీసీ సభ్యులు కీసరి శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని స్వర్ణకారుల ఐక్యత, వృత్తి అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక భద్రత కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంఘం బలోపేతమే మన ప్రధాన లక్ష్యం.. స్వర్ణకారుల ఐక్యతే మన బలం అని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండల సంఘాలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి స్వర్ణకార కుటుంబానికి సంఘం అండగా నిలిచేలా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

జిల్లా అధ్యక్షులు బావోజీ పండరీచారి మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులందరూ బాధ్యతతో పనిచేసి జిల్లాలోని స్వర్ణకారుల అభ్యున్నతికి



కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, స్వర్ణకార సంఘం నాయకులు, సభ్యులు, పెద్ద సంఖ్యలో స్వర్ణకారులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



## బేటి బచావో... బేటి పడావో భాగంగా ప్రతిజ్ఞ

మెదక్ /రేగోడ్ ఆగస్టు 31(విజన్ ఆంధ్ర ): రేగోడ్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ కృష్ణ వేణి ఆధ్వర్యంలో బేటి బచావో ... బేటి పడావో కార్యక్రమంలో భాగంగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించడం జరిగింది. జిల్లా పరిషత్ విద్యార్థినులు మండల స్థాయి అధికారులకు రాఖీలు కట్టి వారికీ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల బాలికల రక్షణ,విద్య, సాధికారత పై వారికీ అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు వారి భద్రత, హక్కులు, పరిరక్షణకు కృషి చేస్తామని మండల అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గురునాథ్,ఎంపిడిఓ శ్రీనివాస్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆష్ట లో దోమల మందు పిచికారీ

ముధోల్: 31ఆగస్టు:ముధోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో దోమల నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం గ్రామంలోని ప్రధాన వీధులు,నివాస ప్రాంతాల్లో దోమల మందును(ఫాగింగ్) పిచికారీ చేశారు. దోమల వల్ల వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు. వర్షాకాల దృశ్య సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల బెడద తీరుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: జిల్లా రెవెన్యూ అధికారి మాలతి,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలతి మాట్లాడుతూ, ప్రజావాణిలో సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా న్యాయ అధికారి హాజరై, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 86 దరఖాస్తులు అందాయన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారిని శ్రీదేవి**

**- ప్రభుత్వంకే ప్రకటించిన 7 సన్న రకాల ధాన్యం గురించి రైతులకు అవగాహన**

మెదక్ /రేగోడ్ ఆగస్టు 31(విజన్ ఆంధ్ర ):రేగోడ్ మండల రైతులు వారు వేసే పంటలకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని సోమవారం మండల వ్యవసాయ అధికారిని శ్రీదేవి పత్రిక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఏడు సన్న రకాల ధాన్యం రైతులు ఏ డీలర్ వద్ద కొనుగోలు చేశారో ,ఆ డీలర్ వద్ద సెప్టెంబర్ నెల 10 లోగా ఆన్లైన్లో నమోదు చేసుకుంటేనే,రూ"500/- బోనస్ కు అర్హులని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. ఈ కింద 7 రకాలు సాగు చేసిన రైతులకు మాత్రమే 2026 వానాకాలం బోనస్ వస్తుందని తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా),బిపిటి 5204( సాంబ మసూరి),కేఎన్ఎం 1638(కునారం సన్నాలు),హెచ్ఎంటి సోనా జైశ్రీరామ్ ఔ+షా 44 (సిద్ది) కేఎన్ఎం 7715 తెలిపిన సన్న రకాలు అమ్మినటువంటి సదరు డీలరులు సెప్టెంబర్ నెల 10 లోగా రైతు విత్తన కొనుగోలు వివరాలను ఆన్లైన్ చేయాలని మండల వ్యవసాయ అధికారిని శ్రీదేవి సూచించారు. డీలర్ వద్ద కాకుండా రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి స్వీయ ధృవీకరణ పొందాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వే లో భాగంగా ప్రతి గ్రామానికి ఒక వాలంటీర్ ను ఏర్పాటు చేయటం జరిగిందని, వాలంటీర్ రైతు పొలాల వద్దకు వచ్చినపుడు పంట వివరములు నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. రైతులు నమోదు చేసిన ప్రకారం వారి ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని తెలియచేశారు.



# మంచాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ):ప్రజా సమస్యలు, భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మంచాల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచాల మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పగడాల యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ......గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. భూ సదస్సుల్లో దరఖాస్తులు పెట్టిన అమలు కాలేదని ఇప్పటికైనా భూ సమస్యలు పరిష్కరించాలని, వృద్ధులకు వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు పరిష్కరించాలని, మండలంలోని చాలా గ్రామాలలో రోడ్డు గుంతల మాయమై ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని బీటీ రోడ్లు తొందరగా వేయాలని కోరారు. గ్రామాలలో రేషన్ షాపులలో 14 రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రావుల జంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, కందుకూరు మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్, మండల కార్యదర్శివర్గ సభ్యులు మార బుగ్గరాములు, మండల కమిటీ సభ్యులు పోచమోని కృష్ణ, పులగల గోపాల్, కాళ్ల జంగయ్య, అన్నారం లెనిన్, పలాటి జగన్, బోయపల్లి సుధాకర్, రంగాపూర్ సర్పంచ్ నేనావత్ బాలకృష్ణ, మంచాల మండల పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు హుసుఫ్ అలీ, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు సూకరి దినేష్, ఈరమళ్ళ శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హాఫిజ్ పాషా, లోయపల్లి గ్రామ శాఖ కార్యదర్శి ఊరుపక్క లింగం, రంగాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి వాలవొజీ అశోక్, మంచాల శాఖ కార్యదర్శి గడ్డం బాలరాజ్, తిప్పాయిగూడ గ్రామ శాఖ కార్యదర్శి సుధాకర్, పార్టీ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు అమలు చేయాలి

**- బీఆర్ఎస్ మల్లంపల్లి మండల అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్**

(విజన్ ఆంధ్ర) ఆగస్ట్ 31:మల్లంపల్లి మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణరావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పాలెపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు 100 శాతం రుణమాఫీ, మహాలక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీల వంటి హామీలను అమలు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, టౌన్ అధ్యక్షులు చీదర సంతోష్, యూత్ అధ్యక్షులు మొర్రి రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉజ్వల కనెక్షన్ ఇచ్చారు.. సిలిండర్ మరిచారు...

**- ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగిన పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీ**

**- చౌటకూరులో ఇళ్ల స్థలాల లబ్దిదారుల జాబితాను వెల్లడించండి**



చౌటకూర్ ఆగస్టు 31 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద మంజూరైన పొయ్యి, రెగ్యులేటర్, ధృవపత్రాలు అందజేశారని.. సిలిం డర్ మాత్రం ఇవ్వలేదని లబ్దిదారులు ఆరోపించారు. చౌటకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో లబ్దిదారులు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద చౌటకూర్లో అర్హులైన లబ్దిదారులకు కనెక్షన్లను మంజూరు చేసిందని తెలియజేశారు. సిలిండర్ అందజేయాలని గత ఆరు నెలలుగా పుల్కల్లోని భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గ్యాస్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతీ సోమవారం విధిగా మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, చౌటకూర్లో మొత్తం 21 శాఖల అధికారులకు 14 శాఖల అధికారులు హాజరయ్యారు. ఎక్సైజ్, పంచాయతీ రాజ్, నీటి పారుదల, గృహ నిర్మాణం, అటవీ శాఖ, రోడ్లు భవనాలు, పౌర సరఫరాల శాఖల అధికారులు ప్రజావాణికి గైర్హాజరయ్యారు. గైర్హాజరైన శాఖల అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని నోడల్ అధికారి శంకర్ తెలిపారు. కాగా, ప్రజావాణిలో మూడు దరఖాస్తులు వచ్చాయి. వెండికోలులో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల వసతి లేదంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రమైన చౌటకూర్ పంచాయతీలో నిరుపేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల యజమానుల వివరాలు తెలియజేయాలంటూ ఆ గ్రామ సర్పంచ్ పార్వల రాంరెడ్డి అధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ సలంలో ఎంత మంది లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, సలాల కేటాయింపుపై సమగ్ర వివరాలను పంచాయతీకి అందజేయాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలి:

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ లో జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ భవనం సైన్స్ బ్లాక్ ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది చురుకుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యు సి ఈ ఎస్ టి హెచ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి. నరసింహ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని, పచ్చని, ఆరోగ్యకరమైన క్యాంపస్ వాతావరణాన్ని పెంపొందించడానికి మొక్కలు నాటడం చెట్లను పెంచడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపాల్ ఎ. రఘు రామ్, జాయింట్ రిజిస్ట్రార్ సుధా మాధురి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె. శ్రీనివాస రెడ్డి, అసోసియేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రంజిత్ రెడ్డితో పాటు పలువురు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'పాంచజన్యం'తో కొత్త రాజకీయ శక్తికి శ్రీకారం..

**- ఇందూరు నుంచే సమరశంఖం**

**- తాను పిరికిదాన్ని కాదని.. పిడికిలి బిగించి ప్రజల ముందుకొచ్చానన్న కవిత**

నిజామాబాద్ బ్యూరో: నిజామాబాద్ నగరంలోని ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్లో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికార కాంగ్రెస్తో పాటు బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్త రాజకీయ శక్తి అవసరమని, ఆ దిశగా పాంచజన్య సూత్రాలతో ప్రజల ముందుకు వచ్చామని ఆమె ప్రకటించారు.

'నేను పిరికిదాన్ని కాదు'

తాను పిరికిదాన్ని కాదని, పిడికిలి బిగించి ప్రజల ముందుకు వచ్చానని కవిత అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల బతుకులు మారలేదని విమర్శించారు. కొత్త రాజకీయ శక్తిగా ఎదగడానికి ఇందూరు ప్రజలు తనకు ధైర్యం, అండగా నిలవాలని కోరారు.

'కాళేశ్వరంతో నిజామాబాద్లో ఒక్క ఎకరమైనా పండిందా?'

రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరం అయినా సాగులోకి వచ్చిందా అని కవిత ప్రశ్నించారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులు నిర్మించి ప్రజలకు ఏం ప్రయోజనం కలిగిందని నిలదీశారు.

తీహార్ జైలు అంశంపై ఆవేదన

తాను ఏ తప్పు చేశానని తీహార్ జైలులో పెట్టారని కవిత ప్రశ్నించారు. నాలుగేళ్ల పాటు ఈడీ, సీబీఐ తనను వేధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తప్పు చేయలేదని, అందుకే సుప్రీంకోర్టు జడ్జి సీబీఐ అధికారిపై విచారణకు ఆదేశించారని పేర్కొన్నారు. చేయని తప్పుకు జైలుకు వెళ్లిన తనను పుట్టింటిలాంటి పార్టీ బయటకు పంపిందని కన్నీటి పర్యంతమయ్యారు. అయితే అత్తింటిలాంటి ఇందూరు ప్రజలు తనను అక్కున చేర్చుకున్నారని అన్నారు.

'ప్రశాంత్రెడ్డిని జీవితంలో క్షమించను'

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్రెడ్డిపై కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తండ్రీకూతురిని విడదీసిన ఉసురు తగులుతుందని వ్యాఖ్యానించారు. ప్రశాంత్రెడ్డిని జీవితంలో క్షమించేది లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్లో చేరేందుకు ఆయన బేరసారాలు చేశారని ఆరోపించారు. తాను ఎంపీగా పోటీ చేయించిన సమయంలో తనపై కక్ష కట్టి ఓడించారని విమర్శించారు. ప్రశాంత్రెడ్డి మొదటిసారి సమర్పించిన అఫిడవిట్, 2023లో సమర్పించిన అఫిడవిట్లను పరిశీలిస్తే అవినీతి ఎంత జరిగిందో బయటపడుతుందని ఆరోపించారు.

ఐదు అంశాలతో 'పాంచజన్యం'

తెలంగాణ రాష్ట్రానికి ఏటా సుమారు రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, ఆ నిధులతో అద్భుతమైన ప్రగతి సాధించవచ్చని కవిత అన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్ర ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించవచ్చని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, సామాజిక న్యాయం, వ్యవసాయం, ఉపాధి అనే ఐదు అంశాలను పాంచజన్య సూత్రాలుగా ప్రకటించారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పథకం కింద ఒక ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై కేసీఆర్ మాట తప్పారు

బోధన్ షుగర్ ఫ్యాక్టరీ విషయంలో కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారని కవిత విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడికి ఫ్యాక్టరీని అప్పగించే కుట్ర జరిగిందని ఆరోపించారు. 22ఏ నిబంధనతో ప్రభుత్వం సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు.

ఎంపీ అర్వింద్పై సంచలన ఆరోపణలు

నిజామాబాద్ ఎంపీ అర్వింద్కు ఇందూరుపై ఏం బాధ్యత ఉందని కవిత ప్రశ్నించారు. ఏళ్లుగా కొనసాగుతున్న మాధవనగర్ వంతెన సమస్యపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సెటైర్లు వేసిన ఆయన.. వంతెన నిర్మాణం కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ అర్వింద్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

'ఒక్కొక్కరి అవినీతి బయటకు తీస్తా'

ఇందూరులోని ఎమ్మెల్యేల అవినీతి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటకు తీస్తానని కవిత హెచ్చరించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి అక్రమంగా నిర్వహిస్తున్నారంటూ ఆరోపించిన ఇటుక దందా, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కాంగ్రెస్ నేతలతో కుమ్మక్కై నిర్మిస్తున్నారంటూ ఆరోపించిన భవనాల వ్యవహారాలను ఆధారాలతో బయటపెడతానన్నారు. అలాగే ప్రశాంత్రెడ్డి అక్రమ క్వారీలు, గంజాయి దందాకు సంబంధించిన ఆధారాలను కూడా ప్రజల ముందుంచుతానని పేర్కొన్నారు.

'బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణ కావాలి'

టీఆర్ఎస్ను స్థాపించింది కేవలం బంగారు తెలంగాణ కోసం కాదని, బహుజన తెలంగాణ సాధించడమే లక్ష్యమని కవిత అన్నారు. రాష్ట్రంలో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ను సిద్దిపేట ప్రజలు అక్కున చేర్చుకున్నట్లే.. బహుజన తెలంగాణ కోసం తాను చేస్తున్న పోరాటానికి ఇందూరు ప్రజలు అండగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నేరాల నియంత్రణే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్

## రాంపుర్‌లో పోలీసుల తనిఖీలు.. వాహనదారులకు జరిమానాలు

బెల్లంపల్లి ఆగస్ట్ 31 విజన్ ఆంధ్ర నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు కాసిపేట మండలం దేవాపూర్ పోలీసులు రాంపూర్ గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గంగారాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 45 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు ట్రాలీలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఫేక్ కాల్స్, ఫిషింగ్ మెసేజ్‌లు, సోషల్ మీడియా మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112కు ఫోన్ చేయాలని చెప్పారు.

గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని ఎస్ఐ తెలిపారు.

ప్రజల భద్రత, నేరాల నియంత్రణ లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విజన్ ఆంధ్ర కేశంపేట 01 మండల పరిధిలోని పాపిరెడ్డి కూడా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొప్పునూరి శ్రీశైలం పదవి విరమణ పొందిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. మాజీ జెడ్పిటిసి శ్రావణ్ రెడ్డి హాజరై పదవి విరమణ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీశైలంను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు క్రమశిక్షణ నైతిక విలువలు సేవాభావాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలపాటు విద్యా రంగానికి ఆయన అందించిన సేవలు మరువలేనివాని పేర్కొన్నారు. పదవి విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేశారు. పూర్వ విద్యార్థులు తమ గురువుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తనకు ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తి నచ్చిందని విద్యార్థుల అభివృద్ధి తనకు ఎప్పటికీ ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు తన సేవలను గుర్తించి సన్మానించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# కనుల పండుగగా రాష్ట్ర స్థాయి గణిత, విజ్ఞాన, సాంస్కృతిక మేళా

**విద్యార్థుల నూతన ఆవిష్కరణలు.. ఆకట్టుకున్న సృజనాత్మక ప్రదర్శనలు**

**ఎనిమిది విభాగాల నుంచి 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు**

ముధోల్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ముధోల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గణిత, విజ్ఞాన, సాంస్కృతిక మేళా విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలతో కనుల పండుగగా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఎనిమిది విభాగాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మేళాలో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు.

శిశు, బాల, కిశోర వర్గాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన గణిత, విజ్ఞాన నమూనాలు, నూతన ఆవిష్కరణలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల ఉద్దేశం, తయారీ విధానం, ఉపయోగాలు, శాస్త్రీయ ప్రాముఖ్యతను న్యాయ నిర్ణేతలకు వివరించారు.

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన న్యాయ నిర్ణేతలు ఒక్కో ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారి ఆలోచనలు, ప్రయోగాల విధానం, శాస్త్రీయ దృక్పథాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ ప్రాజెక్టులను వివరించడం సందర్శకులను ఆకట్టుకుంది.

కార్యక్రమానికి ముధోల్ మండల విద్యాధికారి గోపిడి రమణారెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. న్యాయ నిర్ణేతలను సైతం నిర్వాహకులు సత్కరించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, గణితంపై ఆసక్తి, సృజనాత్మకత, పరిశోధనా తత్వం, నూతన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి మేళాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

# గ్రామ పంచాయతీలో అక్రమాలు..

**- ఎంపీడీఓ కి ఉప సర్పంచ్ ఫిర్యాదు**

**- అధికారుల తనిఖీలకు, చర్యలకు డిమాండ్**

సారంగాపూర్ ఆగస్టు 31(విజన్ ఆంధ్ర): సారంగాపూర్ మండలం జామ్ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా పాలనా వ్యవహారాల్లో సర్పంచ్ భర్త జోక్యం చేసుకుంటున్నారని ఉప సర్పంచ్ భింగి గంగాధర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ?మహిళకు కేటాయించిన సర్పంచ్ పదవిని ఆసరాగా చేసుకుని, ఆమె భర్త అనధికారికంగా గ్రామ పంచాయతీ కీలక నిర్ణయాలు, పాలనా అంశాల్లో వేలు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పనులు, ఇతర సమాచారాన్ని ఉప సర్పంచ్‌కు కూడా తెలియజేయకుండా పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- అక్రమాలపై ఉప సర్పంచ్ లేవనెత్తిన ప్రధానాంశాలు

- గ్రామసభల నిర్వహణలో నిర్లక్ష్యం:

ఇంతవరకు సరిగ్గా గ్రామసభలు నిర్వహించలేదని, ఒకవేళ సమావేశాలు ఏర్పాటు చేసినా రాత్రి వేళల్లో ఎజెండా పంపి, మరుసటి రోజు ఉదయమే సమావేశాలు ముగిస్తున్నారని తెలిపారు.

- సర్పంచ్ భర్త దౌర్జన్యం

ప్రజల సమస్యలను పంచాయతీ సమావేశాల్లో ప్రస్తావిస్తే, "అవన్నీ నేను చూసుకుంటా, నీకెందుకు?" అంటూ సర్పంచ్ భర్త దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.

- సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి

పంచాయతీ కార్యాలయంలో జరిగే అక్రమాలను అరికట్టడానికి, కార్యాలయంలో సీసీ కెమెరాలను అమర్చడానికి అనుమతి ఇవ్వాలని ఎంపీడీఓను కోరారు. ?గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఉప సర్పంచ్ భింగి గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

# మల్లంపల్లి ప్రజావాణికి 23 ఫిర్యాదులు

**- పిర్యాదు దారులు మండల ప్రజావాణిని వినియోగించుకోవాలి**

**- ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో పని చేయాలి - ఎంపీడీవో ఎం.డి.రహీముద్దీ**

(విజన్ ఆంధ్ర) ఆగస్ట్ 31:జేడీ మల్లంపల్లి, : ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ శాఖలకు చెందిన 14 మంది అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి సమస్యలు,ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజావాణిలో మొత్తం 23 ఫిర్యాదులు అందాయని,వీటిలో హౌసింగ్ శాఖకు 10,ఇరిగేషన్ శాఖకు 6,తహసీల్దార్ కార్యాలయానికి 5,ఏఈ/ఆర్‌డబ్ల్యూఎస్‌కు 1,ఎంపీవోకు 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని మల్లంపల్లి ఎంపిడిఓ ఎం.డి.రహీముద్దీ తెలిపారు.ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని,అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగకరంగా ఉందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో మల్లంపల్లి మండల వివిధ శాఖల అధికారులు,పిర్యాదు దారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నేడు



బెల్లంపల్లి ఆగస్ట్ 31 విజన్ ఆంధ్ర : బీఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ఏ--3 క్వార్టర్‌లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరగనుంది.

పార్టీ ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని దుర్గం చిన్నయ్య కోరారు. పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులు కూడా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భూభారతి సర్వేకు గ్రామసభలు

**ముధోల్ మండలంలో మూడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు**

ముధోల్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమంలో భాగంగా భూముల సమగ్ర సర్వే నిర్వహించేందుకు ముధోల్ మండలంలోని జలాల్పూర్, గూడూరు, గోవిందాపూర్, చందాపూర్ గ్రామాలను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కరేగాం, ఎడ్‌బిడ్, వెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతి కార్యక్రమం, భూముల సర్వే ప్రక్రియ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులు గ్రామస్తులకు వివరించారు. భూములకు సంబంధించిన వివరాలు, హక్కులు, రికార్డుల పరిశీలనలో ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. గ్రామసభల్లో ముధోల్ తహసీల్దార్ శ్రీమతి కే. శ్రీలత, ఉప సర్వేయర్ గంగా నర్సయ్య, కరేగాం సర్పంచ్ మైత్రి నారాయణ, ఎడ్‌బిడ్ సర్పంచ్ రామచందర్‌రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ శ్రీమతి శ్రావణి గంగాశేఖర్, మండల గిర్దావర్ నారాయణరావు పాటిల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్నవారికి కొండంత అండ పిసిఆర్ ఫౌండేషన్

### పేద ఇంటి ఆడబిడ్డ పెళ్లికి ఫౌండేషన్ తరుపున 5 వేల ఆర్థిక సహాయం

జన్నారం, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ఆపదలో ఉన్నవారికి పిసిఆర్ ఫౌండేషన్ కొండంత అండగా నిలిచి ఆర్థిక సహాయం అందిస్తూ ప్రజలలో భేష్ అనిపించుకుంటుంది. జన్నారం మండలంలో ఏ ర్పాటు చేసిన పిసిఆర్ (పూర్ణచందర్ రావు) ఫౌండే షన్ ఆధ్వర్యంలో మండలంలో ఏ ఆపద వచ్చిన మేమున్నాం అంటూ చేయూత నిచ్చి మానవత్వం చాటుతోంది. ధానిలో భాగంగానే మండలం లోని చింతగూడ గ్రామానికి చెందిన బిస్సుల రామన్న--సరోజ దంపతుల కుమార్తె మానస వివాహం సం దర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వెల రూపాయ ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అప్పలాయచెరువు సర్పంచ్ పెద్దమ్మల సత్యంను పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

**- కుటుంబ సభ్యులకు మనోధైర్యం.. అవసరమైన సహాయం అందిస్తానని భరోసా**

నంగునూరు, మండలం ఆగస్టు 31 విజన్ ఆంధ్ర : నంగునూరు మండలం అప్పలాయచెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యంకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న పెద్దమ్మల సత్యంను పరామర్శించారు. అనంతరం వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులను కూడా పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి వారికి మనోధైర్యం కల్పించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తన బాధ్యతగా భావిస్తానని ఆయన తెలిపారు. పెద్దమ్మల సత్యం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, అవసరమైన సమయంలో తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన పరామర్శించి ధైర్యం చెప్పడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కొలమాలో ఘనంగా అన్నా బావుసాటే జయంతి వేడుకలు

గాదిగూడ, ఆగస్టు 31(విజన్ ఆంధ్ర ):సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నాభావు సాఠె జయంతి వేడుకలను కొలమా గ్రామపంచాయతీలోని కొలమా ఎస్సీ గూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాంగ్ సమాజ్ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సాఠె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి జగనాథ్ మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లకుండానే ఏకలవ్యుడిలా ఇష్టంగా కష్టపడి విద్యాజ్ఞానాన్ని ఆర్జించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కవి, రచయితగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చేందుకు మంగ్ సమాజ్ నేటి యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దయానంద్,శివ, నాగనాథ్,సంజు, మంగ్ సమాజ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**- కూల్చివేతకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి..**

**- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేస్తే సహించేది లేదన్న తహసీల్దార్**



బోడుప్పల్, ఆగస్టు 31(విజన్ ఆంధ్ర): ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో సర్వే నంబర్లు 28 నుంచి 39 వరకు ఉన్న ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. కూల్చివేత చర్యలకు వెళ్లిన రెవెన్యూ అధికారిపై భౌతిక దాడి జరిగినట్లు సమాచారం.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని మేడిపల్లి తహసీల్దార్ వెంకట నర్సింహ్మా రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటమే రెవెన్యూ శాఖ బాధ్యత అని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడిన ఘటనపై కూడా అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# అలీమా కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ఆపన్నహస్తం

**- 50 కిలోల బియ్యం తక్షణ సాయం అందజేత**



నంగునూరు మండలం ఆగస్టు 31 విజన్ ఆంధ్ర : నంగునూరు మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన మహమ్మద్ షకూర్ భార్య అలీమా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మృతురాలి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన మానవతా దృక్పథంతో తక్షణ సాయం అందించారు.

అలీమా మృతి విషయాన్ని బొంగు శ్రీకాంత్ వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి పంపించారు. వంగ రాజేశ్వర్ రెడ్డి అందించిన సహాయాన్ని గ్రామ యువకులు, వీఆర్ఆర్ టీం సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తన సహాయ సహకారాలు కొనసాగిస్తానని వంగ రాజేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందించడం పట్ల గ్రామస్తులు, స్థానికులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో బొంగు శ్రీకాంత్, ఫస్ట్ వార్డు మెంబర్ చందు, ముడిక రాజు, ఎండి షర్ఫుద్దీన్, ఎండి అజ్జు, ఎం. వినయ్, జె. కనకరాజ్, టి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడుకోసం నిరుపేద కుటుంబం ఎదురు చూపు

**- ఆశల వలయంలో నిరుపేద కుటుంభం.**

**- ఇందిరమ్మ ఇల్లు మంజూరైన కట్టుకోలేని దీనస్థితి.**

**- రేకులతో ప్రహరీ నిర్మించుకొన్న ఇంటిలో భయంతో బిక్కు బిక్కుమంటూ జీవనం గడుపుతున్న నిరుపేద కుటుంభం**

**- దాతల కోసం నిరుపేద కుటుంబం ఎదురు చూపు.**



నందిగామ:ఆగస్టు 31(విజన్ ఆంధ్ర న్యూస్); ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన నిరుపేద కుటుంబాల దీనస్థితి,జీవనశైలి మాత్రం మారడం లేదు.రెక్కడితేనేగానీ డొక్కాడని ఒక నిరుపేద కుటుంబం గూడుకోసం ఎదురు చూస్తూ, భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్న సంఘటన మామిడిపల్లి గ్రామంలో వెలుగు చూసింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామపంచాయతి పరిదిలోగల, దేవుని మామిడిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డం పూజిత - వంశీ దంపతులు.భార్య గృహిణి,భర్త పెయింటింగ్ వృత్తి,చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.తమ ఇల్లు పూర్తిగా శిథిలావస్థలో ఉండటంతో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి పరిస్థితి చూసి అధికారులు,పాలకులు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు.కానీ నిరుపేద కుటుంబంలో వచ్చిన సమస్యల వల్ల వారి పరిస్థితి మరింత సమస్యల్లో కూరుకుపోయింది. ఇంటిని నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో గత ఐదు సంవత్సరాలుగా రేకులతో ప్రహరీ నిర్మించుకొన్న ఇంటిలో బిక్కు బిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు పేద కుటుంబ సభ్యులు తెలిపారు.ఎవరైనా దాతలు మా పేద కుటుంబంపై దయ తలచి సహాయ, సహకారాలు అందిస్తే సొంతింటి కలను నిజం చేసుకుంటామని "విజన్ ఆంధ్ర" దినపత్రిక ప్ర తినిదితో వారి గోడును వెళ్లబోసుకున్నారు. ప్రజాప్రతినిధులు,అధికారులు,స్వచ్ఛంద సంస్థలు స్పందించి,నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని వేడుకుంటున్నారు.